J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 32 10.01.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## సీఐడీ - ఏసీబీ - సీబీఐ - ఈడీల చెవిలో పువ్వు



# తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా!

- విచారణల్లో నాయకుల నాటకాలు
- అధికారులను జోకర్లను చేస్తున్న నేతలు
- ప్రభుత్వ వ్యవస్థలంటే లెక్కలేనితనం
- అబాసుపాలవుతున్న దర్యాప్తు సంస్థలు

'ప్రజాస్వామ్యం దారి తప్పితే మూకజన పాలన అవుతుంది.. మెజారిటీ పేరుతో అక్రమార్కులు, అవినీతిపరులు రాజ్యమేలేందుకు అవకాశం కల్పించే రహదారిగా మారుతుంది..' ఓ గ్రీకు తత్వవేత్త చెప్పిన ఈ మాట నిజమనిపించేలా తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితులు కనిపిస్తున్నాయి. 'రాజకీయమంటే అవినీతికి పుట్టినిల్లు' అనే స్థాయిలో.. మొదట డబ్బుతో అధికారాన్ని కొనడం, తర్వాత దర్జాగా వేల కోట్ల అక్రమ సంపాదనకు బాటలు వేసుకోవడం నాయకులకు పరిపాటిగా మారింది. ఈ క్రమంలో తమ అవినీతి బట్టబయలై.. కేసులు నమోదైనప్పుడు విచారణకు హాజరయ్యే క్రమంలో నాయకులు చేస్తున్న విన్యాసాలు అన్నీఇన్నీ కావు.. వారి నక్కజిత్తుల ముందు దర్యాప్తు సంస్థల అధికారులు నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు. ఫలితంగా ప్రజాస్వామ్యం.. న్యాయదేవత సాక్షిగా అపహాస్యమవుతోంది. 10లో..

## గోవిందుని చెంత ఘోరం

వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో టీటీడీ నిర్లక్ష్యం


**తొక్కిసలాటలో ఆరుగురి మృతి**

బాధితులని పరామర్శించిన ముఖ్యమంత్రి 10లో

## శ్రీసిటీకి ప్రధాని పొగడ్త

జనవరి 8న బుధవారం నాడు రాష్ట్రానికి వచ్చిన భారత ప్రధాని నరేంద్రమోడీ శ్రీసిటీని పొగడ్తలతో ముంచెత్తారు. విశాఖపట్నంలో జరిగిన అతిభారీ బహిరంగసభలో ప్రధాని నోట శ్రీసిటీ మాట రావడం పారిశ్రామిక వర్గాలలో ఉత్సాహాన్ని రేపింది. 10లో






## నెల్లూరు జిల్లాలో..

# 19,44,664 మంది ఓటర్లు

### తుది జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

కొత్తగా చేర్పులు, తొలగింపులు, కొత్తగా చేరిన ఓటర్లు అన్నిటినీ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా తుది ఓటర్ల జాబితా–2025ని ఈనెల 6న విడుదల చేసింది. దానిప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల సంఖ్య 4,14,40,447కి చేరుకుంది. అందులో పురుషులు 2,03,52,818 కాగా మహిళా ఓటర్లు 2,10,84,231 మంది, థర్డ్ జెండర్లు 3400 మంది ఉన్నారు. అదేవిధంగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 19,44,664గా నమోదైంది. అందులో పురుష ఓటర్లు 9,50,600, మహిళా ఓటర్లు 9,93,283 మంది ఉన్నారు. థర్డ్ జండర్లు 210, సర్వీసు ఓటర్లుగా 571 మంది నమోదయ్యారు. మొత్తంగా జిల్లాలో కూడా మహిళా ఓటర్లదే పైచేయి.

### నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు :

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా ఉన్నాయి.

కందుకూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,28,698 మంది ఉండగా, వీరిలో పురుషులు 1,13,081 మంది, మహిళలు 1,15,591 మంది, ఇతరులు 26 మంది ఉన్నారు.

కావలి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,39,659 మంది ఉండగా, పురుషులు 1,17,540 మంది, మహిళలు 1,22,091 మంది, ఇతరులు 28 మంది ఉన్నారు.

ఆత్మకూరులో 2,15,266 మంది ఓటర్లుండగా, వారిలో పురుషులు 1.05,718 మంది, మహిళలు 1,09,542 మంది, ఇతరులు 6గురు ఉన్నారు.

కోవూరు నియోజకవర్గంలో 2,66,828 మంది ఓటర్లుండగా, వారిలో 1,28,642 మంది మహిళలు, 1,38,161 మంది పురుషులు, 25 మంది ఇతరులు ఉన్నారు.

నెల్లూరు నగర నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,39,260 మంది ఉండగా, వారిలో పురుషులు 1,16,590 మంది, మహిళలు 1,22,603 మంది, ఇతరులు 67 మంది ఉన్నారు.

నెల్లూరు రూరల్‌లో 2,81,291 మంది ఓటర్లుండగా, వారిలో పురుషులు 1,36,816 మంది, మహిళలు 1,44,454 మంది, ఇతరులు 21 మంది ఉన్నారు.

సర్వేపల్లిలో మొత్తం ఓటర్లు 2,32,146 మంది ఉండగా, అందులో పురుషులు 1,12,863 మంది, మహిళలు 1,19,257 మంది, ఇతరులు 26 మంది ఉన్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,516 మంది కాగా, పురుషులు 1,19, 895 మంది, మహిళలు 1,21,610 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు.

## ఆరోప్రాణం

ఇల్లంటే..
ఓ జీవన భాష.. ఓ జీవిత భాష్యం
నిత్యం ఉషోదయం నుంచి నీడనిచ్చే
ఓ మహోన్నత భావోద్రేకం
భావోద్వేగం!
ఆ తలుపును ముట్టుకుంటే
తనువును ముట్టుకొన్నట్లే
ఆ గోడను తాకితే
గుండెను తాకినట్లే!
సాయంత్రం అయితే చాలు
ఇంటికి చేరితే చాలు
గంపెడు ఉషోదయాలు
క్రమ్ముకుంటాయి.
ఏదో తెలియని అత్తరు
వాసనలు, సుగంధ ప్రేలా
పనలు కట్టిపడవేస్తాయి.
ఇల్లు కూల్చేవాడికేం తెలుసు
ఇంటి మహాత్మ్యం!
ఇంటితో ముడిపడిన అనుబంధం!
'ఆత్మ'పరిభ్రమణాల్ని
అలరించి అలంకరించే
చోటు ఈ లోకంలో ఇల్లే కదా నేస్తం
ఆత్మీయతతో ఆలింగనం
చేసుకొనేది గృహస్వర్గసీమే కాదా
ఇల్లంటే అంకెలూ కాదూ
సంఖ్యలూ కాదు.
హృదయానికి మనసుకు
ముడిపడిన సంకెలలని అర్థం
ఎన్నో భావనల ప్రతిరూపమే కదా
ఇల్లంటే...
ఎన్నో ఊపిరులూదిన
కమ్మటి కలలే కదా!
సామాన్యునికి ప్రాణం
అసమాన్యునికే
ఆరో ప్రాణం!!



**చిన్నినారాయణరావు**
9440202942

# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

### మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, అవసరమైన నిధులు అందజేసేందుకు సిద్ధంగా ఉందని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ తప్పిదాలతో రాష్ట్రం అప్పులపాలైందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే అమరావతిని పూర్తిచేయాలని, అందుకు కేంద్రం పూర్తి సహాయసహకారాలందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ నాయకులు శీపా వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, వాకాటి నారాయణరెడ్డి, కె. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల పరిశీలనలో వైద్యబృందాలు

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పింఛన్ల పరిశీలన ప్రారంభమైంది. జిల్లాలో నకిలీ ధ్రువపత్రాలతో పింఛను తీసుకుంటున్నవారిని గుర్తించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి వచ్చిన వైద్యులతో ఏడు బృందాలను ఏర్పాటుచేసి పింఛనుదారుల ఇళ్ళకు వెళ్ళి పరిశీలన చేస్తున్నారు. ఈనెల 6న సంబంధిత వైద్యసిబ్బందితో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సమావేశమయ్యారు. జిల్లాలో 1274 మంది హెల్త్ పింఛన్లను అందుకుంటున్నారని, ప్రతి లబ్దిదారుని ఇంటికి వెళ్ళి పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం వారు అర్హులా, అనర్హులా అనే వివరాలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

## జిల్లా పేరును గబ్బు పట్టిస్తున్న...

# 'రో(మే)త వ్యాపారం'

### చేపలకు మేతగా.. కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాలు

### చెక్‌పోస్టుల కళ్ళుగప్పి.. డ్రమ్ములకొద్దీ వస్తూనే ఉన్నాయి

**చేపలగుంటల్లోని చేపలకు మేతగా వేయడానికి కొంతమంది అక్రమార్కులు రోత వ్యాపారానికి దిగారు. కుళ్ళి కంపు కొడుతున్న చికెన్ వ్యర్థాలను వేసేందుకు అలవాటుపడిన చేపలగుంటల యజమానులతో కలసి ధనార్జనకు దిగారు. దీంతో జిల్లాలో ఈ 'రోత' వ్యాపారానికి అడ్డే లేకుండా పోతోంది. ప్రజారోగ్యానికి పాతర వేస్తున్న ఈ రోత వ్యాపారాన్ని నిరోధించాలంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం నిమ్మళంగానే ఉన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ అనైతిక వ్యాపారంపై, కల్తీమేతతో చేపలు పెంచే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.**



మత్స్యశాఖ అధికారులు, స్థానికంగా ఉండే పోలీసులు ఎంతగా చెప్పినా పెడచెవిన పెడుతూ, జిల్లాలోని అనేక గ్రామాలకు గబ్బుకొడుతున్న చికెన్ వ్యర్థాలు నిత్యం వస్తూనే ఉన్నాయి. తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి ఈ వ్యర్థాలను వాహనాల్లో జిల్లాకు తీసుకువచ్చి చేపలగుంటల్లో వేస్తున్నారు. పనికిరాని కోళ్ళ వ్యర్థాలను తక్కువ ధరకే గుట్టలకొద్దీ కొనుగోలు చేసి, రహస్యంగా వాటిని జిల్లాకు చేరుస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అన్ని చెక్‌పోస్టులను దాటి అవి జిల్లాలోకి ఇంతకాలంగా ఎలా ప్రవేశిస్తున్నాయో పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంది. ఆ వ్యర్థాలను వేస్తే చేపల బరువు పెరుగుతాయన్నది యజమానుల దురాశ. అందుకే ఈ అనైతిక వ్యాపారానికి వారు తెగబడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వాటిని తెచ్చి చేపలగుంటల్లో వేస్తున్నారని అంటున్నారు. ఇటీవల కోవూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇలాంటి చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో కోవూరు ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేస్తూ, వెంటనే వాటిని నియంత్రించాలని, చేపలగుంటల్లో కోళ్ళవ్యర్థాలను వేయడం నిషేధమని స్పష్టం చేశారు కూడా. అయినప్పటికీ చాటుమాటుగా ఈ దుర్గంధ వాహనాలు వస్తూనే ఉన్నాయి. ఒక్క కోవూరులోనే కాదు, జిల్లాలోని అనేక గ్రామాలకు గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో దొడ్డిదారుల్లో అవి చేరిపోతూనే ఉన్నాయని గ్రామాల్లో పెద్ద ఆందోళనగా ఉంది.

### ఇదో పెద్ద వ్యాపారంగా మారింది

చెన్నై, బెంగుళూరు ప్రాంతాల్లో కోళ్ళ కర్మాగారాల వద్ద, కోసిపడేసిన కోళ్ళముక్కల్లో పనికిరానివాటినంతా తీసి, డ్రమ్ముల్లో పెట్టి పారేసేవారు. కానీ, వాటికిప్పుడు ఈ చేపలగుంటల వల్ల డిమాండ్ పెరగడంతో ఎంతోకొంతకి అమ్మేస్తున్నారు. జిల్లాలోని చేపలచెరువుల యజమానులు అనేకమంది..చూస్తేనే వాంతులొచ్చే ఆ కుళ్లిపోయి గబ్బుకొడుతున్న ముక్కలన్నిటినీ కొనుగోలు చేసి, చేపలగుంటల్లో వేస్తున్నారు. గత కొంతకాలంగా ఇదో పెద్ద వ్యాపారంగా మారింది. జిల్లాలోని వారే కాక, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు కూడా స్థలాలు, పొలాలు లీజుకు తీసుకుని, చేపలగుంటలు సాగుచేస్తూ, తద్వారా లక్షలకు లక్షలు అక్రమార్జన చేస్తున్నారు. చేపలకు వేయాల్సిన అసలైన మేత వేయకుండా, అత్యంత స్వల్ప ధరకే వచ్చే మురుగుడు చికెన్‌ముక్కలను తీసుకొచ్చి వేస్తున్నారు. ఆ చేపలను తిన్నవారి ఆరోగ్యం ఎంతగా దెబ్బతింటుందో ఇక చెప్పాల్సిన పనే లేదు. ఒక డ్రమ్ము చికెన్‌వ్యర్థాలు కేవలం 5వేలకే దొరుకుతుండడంతో వాహనాలుండేవాళ్లు వాటిని అక్రమంగా తీసుకొచ్చి, చేపలగుంటల వారికి 15వేలకు అమ్ముతున్నారని సమాచారం. వాటిని లారీల కొద్దీ కొనేసి చేపలగుంటల్లో వేస్తున్నారని గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు.

### ఆగని దందా..




ఇటీవల దాదాపు 130 డ్రమ్ములకు పైగానే చికెన్‌వ్యర్థాలను అధికారులు పట్టుకుని, వాటిని గొయ్యితీసి పూడ్చి పెట్టారు కూడా. అయినా వీటి రాకపోకలు ఆగడం లేదు. ఈనెల 6వ తేది వేకువన చికెన్‌వ్యర్థాలను భారీగా తీసుకువెళ్తున్న ఓ వాహనాన్ని ముత్తుకూరు మండలం తాళ్ళపూడి పంచాయతీలోని బసరాలదిబ్బ గిరిజనకాలనీ వద్ద సర్వేపల్లి జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్ నాయుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ వాహనంలో పెద్దపెద్ద డ్రమ్ముల్లో నిండుగా కుళ్ళి, భయంకరమైన దుర్వాసన వస్తున్న కోళ్ళ వ్యర్థాలున్నాయి. చికెన్‌వ్యర్థాల వాహనాల రాకపోకలతో ఆ దుర్వాసనను భరించలేకపోతున్నామని, నిత్యం ఇలాంటి వాహనాలు వస్తూనే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా ఈ రోత వ్యాపారాన్ని నియంత్రించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




## ప్రథమ పౌరులకి ఇమ్మణ్ణి వారి పెళ్ళి పిలుపు

భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి.. మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడి కుమార్తె శ్రీమతి ఇమ్మణ్ణి దీప – వెంకట్‌ల ఏకైక కుమారుడు విష్ణు వివాహం 2025 జనవరి 31న జరగనుంది. ఈ సందర్భంగా దేశ ప్రథమ పౌరులాలు.. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలను స్వయంగా కలసి ఆహ్వానపత్రికలు అందజేసి పెళ్ళికి ఆహ్వానించిన శ్రీమతి దీపా వెంకట్, పెండ్లి కుమారుడు విష్ణు.

# చైనాలో మరో మహమ్మారి?

## బెంబేలెత్తుతున్న ప్రపంచ దేశాలు • భారత్ అప్రమత్తం

### పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న ఆరోగ్యశాఖ



చౌక వస్తువులను విచ్చలవిడిగా ఉత్పత్తి చేస్తూ ప్రపంచ మార్కెట్లపై ఆధిపత్యం చెలాయిస్తున్న చైనా.. తన అసంబద్ధ జీవన శైలితో కొత్తరకం వైరస్‌ల పుట్టుకకూ కారణమవుతోంది. తద్వారా ప్రపంచాన్ని ప్రమాదపుటంచుల్లోకి తీసుకెళ్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. 2019లో కరోనా వైరస్ పుట్టుక చైనాలోనే జరిగిందన్నది నిర్వివాదాంశం. అప్పుడు చాలాకాలం పాటు కరోనా వైరస్ విస్తృతిని ప్రపంచానికి చైనా ప్రభుత్వం తెలియనివ్వలేదు. ఫలితంగా ఆ దేశం నుంచి ఇతర దేశాలకు వెళ్లే యాత్రికులు, వ్యాపారుల ద్వారా కరోనా ప్రపంచ వ్యాప్తంగా ప్రబలింది. పరిస్థితి చేయిదాటేంత వరకూ వేచి చూడడం వల్ల లక్షలాదిగా ఆ దేశంలోనూ ప్రజలు విగతజీవులయ్యారు. అదే సందర్భంలో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మరణాలు సంభవించాయి. ముఖ్యంగా జనాభా అధికంగా ఉండే ఆసియా దేశాలతో పాటు సరైన వైద్య సదుపాయాల్లేని ఆఫ్రికా దేశాల్లోనూ భారీగా ప్రజలు మృత్యువాత పడ్డారు. ఇంతటి కల్లోలానికి కారణమైన చైనాలో తాజాగా మరోమారు కొత్త వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు ప్రపంచాన్ని కలవరపరుస్తున్నాయి.

### హెచ్‌ఎంపీవీ ప్రాణాంతకమా..?

చైనాలో ప్రస్తుతం విలయతాండవం చేస్తున్న హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటానిమో వైరస్) ప్రాణాంతకం కాదని భారతీయ వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది శీతాకాలంలో శ్వాసకోస సంబంధవ్యాధులకు మాత్రమే కారణమౌవుతుందని స్పష్టం చేస్తున్నారు. ఈ వైరస్ సోకిన వారిలో జలుబు, దగ్గుతో పాటూ ఆయాసం ఉంటుందని తరచూ జ్వరం వస్తుంటుందని చెబుతున్నారు. ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఈ వైరస్ వ్యాప్తిస్తే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండే ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులకు ఈ వైరస్ త్వరగా వ్యాపించే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఢిల్లీ ఎయిమ్స్‌లోని వైద్య నిపుణులు, ఆయా రాష్ట్రాల వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శుల సలహాలు సూచనలు తీసుకుంటోంది. భారత్‌లో ప్రస్తుతం హెచ్‌ఎంపీ వైరస్ కేసులు నామమాత్రంగానే నమోదయ్యాయని, ప్రజలు భయాందోళన చెందకుండా శీతాకాలంలో సాధారణంగా పాటించే జాగ్రత్తలనే తీసుకుంటే సరిపోతుందని తెలియజేస్తున్నారు. ఇక చైనా ప్రభుత్వం కూడా హెచ్‌ఎంపీ వైరస్ వల్ల తమదేశంలో ఎలాంటి అలజడి లేదని.. కేవలం ఉత్తరార్ధ గోళం నుంచి వీస్తున్న చలిగాలుల తీవ్రత పెరగడంవల్ల జనం జలుబు, జ్వరం, దగ్గుతో ఆస్పత్రుల్లో చేరుతున్నారని తేల్చి చెబుతున్నారు. అయితే, ఆ దేశంలో జనం గుంపులు, గుంపులుగా ఆస్పత్రుల బాటపడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇక ఇలాంటి విషయాల్లో చైనా తింగరి చర్యలను, చెప్పే అబద్ధాలను ఇదివరకే ప్రపంచం చూసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. కరోనా నేర్పిన గుణపాఠంతో అప్రమత్తమై తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది.

# రాజకీయ రొచ్చులో రెడ్ క్రాస్!



నిస్వార్థ సేవకి చిరునామాగా ఉండవలసిన రెడ్ క్రాస్ వివాదాలకి నిలయంగా మారింది. రెడ్ క్రాస్ నెల్లూరు శాఖ రాజకీయ రొచ్చుతో రచ్చకెక్కింది. గతంలో కూడా రెడ్ క్రాస్ పలు వివాదాలతో వార్తలలోకి ఎక్కింది. అయితే చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో కొత్త కమిటీ ఏర్పడ్డ తరువాత పరిస్థితులు చక్కబడతాయని అందరూ అనుకున్నారు. కానీ, అలా జరగలేదు. ఇప్పుడు కొత్తగా రాజకీయ మకిలం అంటుకుని రెడ్ క్రాస్ పరువు మంట కలిసింది. రెడ్ క్రాస్ అంటేనే సేవాభావం స్ఫురిస్తుంది. కానీ, నెల్లూరు రెడ్ క్రాస్ స్వాహా భావాన్ని గుర్తుకు తెస్తోంది. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పాస్టిక్ సెంటర్, క్యాన్సర్ ఆసుపత్రి, పల్లెపాడు గాంధీ ఆశ్రమాలలో రెడ్ క్రాస్‌ని అడ్డంపెట్టుకుని దొంగలు, ఆర్థిక నేరగాళ్ళు రాజ్యమేలుతున్నారన్న అపఖ్యాతిని నెల్లూరు శాఖ మూటగట్టుకుంది.

తాజాగా కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చి, ప్రస్తుత చైర్మన్ చంద్రశేఖరరెడ్డి తన ఛైర్మెన్ పదవికి రాజీనామా చేశారు. మంత్రి నారాయణ క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా తమ నారాయణ ఆసుపత్రికి లబ్ది చేకూర్చమన్నాడని, అది కుదరదని తాను చెప్పినందుకు రాజకీయంగా తనని ఇబ్బంది పెడుతున్నాడని చంద్రశేఖరరెడ్డి నారాయణపైన ఆరోపణలుచేసి రాజీనామా చేశారు. ఆ ఆరోపణల సారాంశంలోకి వెళ్తే... "నారాయణ ఆసుపత్రిలో క్యాన్సర్ విభాగం ప్రారంభిస్తున్నారని, అయితే అక్కడ రేడియేషన్ విభాగం ఉంటే తప్ప ఆరోగ్యశ్రీ అనుమతి రాదని, అందుకోసం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఆసుపత్రితో రేడియేషన్ సౌలభ్యాన్ని వాడుకోవడానికి పరస్పర ఒప్పందం అడిగారని, అందుకు చంద్ర శేఖరరెడ్డి ఒప్పుకోలేదని, దాంతో తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని తనని వేధిస్తున్నాడన్నది చంద్ర ఆరోపణ సారాంశం". అయితే, ఇక్కడ ఎక్కడ కూడా నారాయణ ఆసుపత్రి వర్గాలు రెడ్ క్రాస్‌ని సంప్రదించినట్లు కానీ, అందుకు రెడ్ క్రాస్ నిరాకరించి నట్లు కానీ లిఖితపూర్వకంగా లేదు. అలావుంటే బయటపెట్టమని ఆనం వెంకటరమణారెడ్డి తనదైన తరహాలో ప్రశ్నించారు.

కలెక్టర్ సైతం చంద్ర రాజీనామా చేసిన వెంటనే బుధవారం కార్యవర్గసభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర పాలసీ ప్రకారం ప్రత్యక్షంగా రాజకీయాలలో ఉన్న వాళ్ళు రెడ్ క్రాస్‌లో కీలక పదవులలో ఉండకూడదని నిర్ణయించారు. ఇక్కడివరకూ కథ నడిచింది. తాజా నిర్ణయం ప్రకారం స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్‌గా వున్న నేతాజీ సుబ్బారెడ్డితో సహా మేనేజింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నవారందరు కూడా రాజీనామా చేయాలి. ముందు ముందు ఏం జరగబోతోందో వేచి చూడాలి...!







లాయర్
జనవరి 10, 2025

# సాంకేతిక ప్రగతితోనే..దేశానికి పురోగతి!

నేటి ఆధునిక కాలంలో, ఈ కంప్యూటర్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఉంటేనే రాణింపు ఉంటుంది. అక్షరాలు నేర్చుకోకపోతే పాఠాలు ఎలా చదవలేమో.. అదేవిధంగా సాంకేతికత తెలియకపోతే జీవితంలో ముందడుగు వేయలేం. ప్రాథమిక విద్య పిల్లలకు ఎంత అవసరమో, నేటి బాలలకు సాంకేతిక విద్య అంతకన్నా ఎక్కువ అవసరం. పూర్వకాలంలో పెద్దబాలశిక్ష చదువుకుని పెద్దవాళ్ళయినట్లుగా, ఇప్పుడు సాంకేతిక శిక్షణతోనే ఎదగాల్సి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక జ్ఞానం శరవేగంగా విస్తరిస్తున్న నేటి తరుణంలో, ఏమాత్రం అశ్రద్ధ వహించినా వెనుకబడి ఉండాల్సి వస్తుంది. ఏ ఒక్క రంగంలోనో కాదు, విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం..ఇలా అన్ని రంగాల్లోనూ ఇప్పుడు సాంకేతికత్వానికదే పైచేయి. ప్రతిరంగంలోనూ ఊహించలేనన్ని మార్పులతో కంప్యూటర్లు వచ్చేశాయి. అంతర్జాలం వచ్చాక ప్రతి సమాచారం చిటికెలోనే అందుబాటులోకి వచ్చేస్తోంది. స్మార్ట్‌ఫోన్లు చేతిలో ఉంటే చాలు అరచేతిలో ప్రపంచమంతా ఉన్నట్లే. గతంలో ఎంతోమంది నైపుణ్యం కలవారు చేసే పనిని, ఒక్క కంప్యూటర్ అంతకన్నా ఎక్కువగా సేవలందిస్తోన్న రోజులివి. కూరగాయల దుకాణానికి వెళ్ళినా, పాలప్యాకెట్టు కొన్నా డిజిటల్ చెల్లింపులే ఎక్కడ చూసినా. అన్ని రకాల వ్యాపారాలు, అనేక రకాల కార్యాలయాల్లో కంప్యూటర్లదే అగ్రస్థానం. అన్ని ప్రభుత్వ-ప్రైవేట్ శాఖల్లో కూడా కంప్యూటర్లు లేకుండా ఏ పనీ జరగదు. అన్ని లెక్కలూ కంప్యూటర్లే చూస్తాయి. అవి లేకుండా ఏమీ చేయలేని పరిస్థితి కూడా వచ్చేసింది. బస్సు టిక్కెట్టు కావాలన్నా, ముందస్తుగా రైల్లో రిజర్వేషన్ కావాలన్నా, చివరికి మనం ప్రయాణించాల్సిన రైలు ఎక్కడ ఉందో తెలుసుకోవాలన్నా కనీస సాంకేతిక పరిజ్ఞానం తప్పకుండా ఉండాలి. అయితే, మనదేశంలో నేటికీ కోట్లాది మంది ప్రజలు నిరక్షరాస్యతతో, అజ్ఞానంతో, అమాయకత్వంతోనే ఉంటున్నారు. ముఖ్యంగా పల్లెపట్టుల్లో, కొండలు కోనల్లోని గిరిజన ప్రాంతాల్లో ప్రజలు నేటి ఆధునికతను అందుకోలేకపోతున్నారు. అందువల్ల వారెంతో నష్టపోతున్నారు కూడా. ప్రపంచంలోని అనేక దేశాలు సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగాములుగా ఉంటూ ఆకాశమే హద్దుగా ముందుకు సాగిపోతుంటే, మనం మాత్రం ఇంకా కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి ఆధునిక సదుపాయాల గురించి ఇంకా తెలుసుకోలేకపోతున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఏ సమాచారమైనా సునాయాసంగానే తెలుసుకునే సాంకేతిక విద్య నేటి తరానికే కాదు, భావితరాలకి కూడా ఒక వరం. అయితే, పాత-కొత్త తరాల కలయికగా ఉండే నేటి తరంలో ఇంకా ఆధునిక విద్య అందరికీ వంటబట్టడం లేదు. గతంతో పోలిస్తే కొంత మెరుగే అయినా, అనేక దేశాలతో పోలిస్తే డిజిటల్ విద్యలో మనం ఎంతో వెనుకబడి ఉన్నాం. దేశంలో చెప్పుకునేందుకు లక్షలాది పాఠశాలలు ఉన్నా, అధికశాతం విద్యాలయాల్లో కంప్యూటర్ల వంటి ఆధునిక పరికరాల వినియోగం కనిపించడం లేదు. ఆర్థికస్థితిగతులు బాగున్నవారు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల వంటివి కొనుగోలు చేసుకుంటున్నారే తప్ప, పేద-మధ్యతరగతి వారు, కార్మికులు, కర్షకులు, కష్టజీవులకు వాటిని కొనడం గగనమైపోతోంది. ప్రభుత్వాలు ఈ పరిస్థితులను గమనించి, ప్రజలందరికీ సాంకేతికత చేరువయ్యేందుకు ప్రణాళికలను రూపొందించాలి. ఆధునిక విద్య లేకపోతే, మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు చేజారిపోతాయి. సాధారణ చదువులెన్ని చదివినా, సాంకేతిక నైపుణ్యం లేకుంటే చేయగలిగిందేమీ లేదు. భవిష్యత్తు అంధకారమవుతుంది కూడా. అందుకే ప్రభుత్వాలు ఇకనైనా మేలుకోవాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పట్ల అందరికీ అవగాహన పెంపొందించేందుకు గ్రామగ్రామానా అవగాహనా సదస్సులు పెట్టాలి. కంప్యూటర్లు, అంతర్జాల వినియోగాన్ని ప్రజలందరికీ చేరువ చేయాలి. పేదలకు తక్కువ ధరతోనే రాయితీపై కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు అందజేసి వాటిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియజెప్పాలి. నిరుపేద విద్యార్థులకు ఉచితంగానే ఇవ్వాలి. పాఠశాలల్లో మంచేదో చెడేదో మార్గదర్శకం చేసే ఉపాధ్యాయులున్నట్లుగా, ఈ కంప్యూటర్ల యుగంలో కూడా మంచివైపు ఎటు వెళ్లాలో తెలియజెప్తూ విద్యార్థులకు, యువతకు అనుభవజ్ఞులైన సాంకేతిక శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను నిర్వహించాలి. నెలకో సారైనా ఈ శిక్షణ క్రమబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కుటుంబంలో ఏ ఒక్కరు ఈ సాంకేతి కతను అందుకున్నా కుటుంబంలోని వారందరికీ వాటి గురిం చిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేందుకు వీలుంటుంది. సాంకేతిక ప్రగతితోనే దేశానికి పురోగతి ఉంటుంది కనుక ప్రభుత్వాలు ఇకనైనా ఆ దిశగా కృషిచేస్తాయని ఆశిద్దాం!...

# మనది కానిదాని కోసం ఎందుకీ ఆరాటం, ఆర్భాటం?

జనవరి1 వస్తుందనగానే.. 'పొరుగింట పుల్లకూర రుచి ఎక్కువ' అన్న సామెత గుర్తొస్తుంది. మనది కాని నూతన సంవత్సరానికి ప్రపంచమంతా డిసెంబర్ ఆఖరి వారం నుండి హడావుడి మొదలయ్యింది.

ముఖ్యంగా మన రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా అతిగా సందడి నెలకొంది. తెలుగు లోగిళ్ళు సైతం జనవరి 1వ తేదీనే తమ కొత్త సంవత్సరంగా భావించి సంబరాలు చేసుకున్నాయి. తెలుగువారి అసలైన నూతన సంవత్సరం 'ఉగాది'. కానీ ఈ విషయం ఇప్పటి తరానికి ఎంతమందికి తెలుసు? అన్నది సమాధానం దొరకని ప్రశ్న. 'ఉగాది' అంటే సంవత్సరంలో ఒకసారి తినే ఉగాది పచ్చడి మాత్రమే చాలా మందికి గుర్తుకొస్తుంది. షడ్రుచులతో తయారు చేసే ఆ పచ్చడిని రుచిచూడడానికి కూడా నేటి యువత ఇష్టపడడం లేదు. మనిషిలోని ఆరు గుణాలకు ప్రతిరూపంగా ఆరు రుచులతో ఉగాది పచ్చడి తయారు చేస్తారు. ఆ పచ్చడి రుచిలాగే ఉప్పు, పులుపు, కారం, చేదు, తీపి, వగరుగా కొత్త ఏడాది గడవాలన్న సంకేతం వచ్చేలా మన పెద్దలు ఈ పచ్చడిని మనకి అందించారు. జీవితం సుఖసంతోషాలతో సాగాలని కోరుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి




lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

పూజ పునస్కారాలతో జరుపుకునే అసలైన మన నూతన సంవత్సర పండుగ ఉగాది.

### అర్ధరాత్రి పూజలు అర్ధరహితం!

కేవలం క్యాలండర్ మారే ఆంగ్ల నూతన సంవత్సరాన్ని మనవాళ్ళు పండగలా చేసుకుంటున్నారు. అర్ధరాత్రి గుళ్ళకి వెళ్ళి పూజలు చేస్తున్నారు. అర్ధరాత్రి పూజలు అర్ధరహితం అని వేదపండితులు తరచూ చెప్తున్నా మనవాళ్ళు పట్టించుకోవడంలేదు. ఆలయాలలో పూజారులు సైతం రాత్రిపూట ఆలయాలని తెరచిపెట్టి ప్రజల బలహీనతని సొమ్ముచేసుకుంటున్నారు.

### రోడ్ల మీద చిందులు!

డిసెంబర్ 31వతేదీ అర్ధరాత్రి 12గంటలైతే చాలు... యువకులు మోటారుబైకులు, కార్లు వేసుకుని రోడ్ల మీదకు దండయాత్ర చేస్తున్నారు. 'హ్యాపీ న్యూఇయర్' అంటూ కేకలు వేస్తూ... రచ్చ రచ్చ చేస్తున్నారు. తామేమీ తక్కువ తినలేదన్నట్లుగా యువతులు సైతం యువకులతో పోటీపడి మరీ రోడ్లమీదకు వచ్చేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో అక్కడక్కడా ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్న సంఘటనలు మనం ప్రతి ఏడాదీ చూస్తూనే ఉన్నాం.

### తెల్లోళ్ళని తరిమేసినా.. వాళ్ళ ఆచారాలని మరువలేకున్నాం!

జనవరి 1ని కొత్త సంవత్సరంగా పాటించడం ఆంగ్లేయుల ఆచారం. వాళ్ళని దేశం నుండి వెళ్లగొట్టినా, వారి ఆచారాలని మాత్రం మనం పాటిస్తూనే ఉన్నాం. తెల్లోళ్ళ కొత్త సంవత్సరాన్ని మనం పండుగగా జరుపుకుంటూ, 'ఉగాది'ని విస్మరిస్తున్నాం. ఇది ఎంతవరకు సమంజసమో ఇప్పటి తరం ఆలోచించుకోవాలి. 'ఉగాది' పర్వదినమే మన కొత్త సంవత్సరం అన్న నిజాన్ని రేపటి తరానికి తెలియపరచాలి. కొత్త సంవత్సరానికి మద్యంతో, మాంసంతో, మత్తెక్కి వేసే చిందులతో కాకుండా.. మంగళవాద్యాలతో, భక్తిశ్రద్ధలతో స్వాగతం చెప్పే సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలి. మనది కాని ఆనవాయితీ కోసం ఆరాటం, ఆర్భాటం మంచిది కాదన్న నిజాన్ని అందరూ గ్రహించాలి!

జే.ఎస్.కృష్ణ - వై.ఎస్.ఆర్.నగర్.




# పుస్తక విలాపం



"హలో! నేను మీకు గుర్తున్నానా..? నా పేరు పుస్తకం".. ఇలా క్రమేణా నన్ను నేను పరిచయం చేసుకునే దౌర్భాగ్యం నాకు కలుగుతుందేమో అని దిగులేస్తోంది. ఒకప్పుడు నేనెంత గొప్పగా ఉండేదాన్నో! తరగని అక్షరాల గనులతో, వాడవాడలా విజ్ఞాన వికాసంతో ఎటుచూసినా నా పేరు మారుమోగుతుండేది. సాక్షాత్తూ సరస్వతీమాతకు ప్రతిరూపంగా మేధావులు నన్ను కొలిచేవారు, కొనియాడేవారు. సాహిత్యాభిమానులు నన్ను భాషామతల్లిగా ఆదరించేవారు, ఆరాధించేవారు.

ఇంటింటా గ్రంథాలయాల రూపంలో రెక్కలు తొడిగి, పిల్లలు, పెద్దలు అన్న తేడాలేకుండా కుటుంబం మొత్తానికి విజ్ఞానాన్ని పంచేదాన్ని. వారు ఆనందంతో పుటలు తిరగేస్తుంటే పులకించిపోయేదాన్ని. మంచేదో, చెడేదో తెలియని అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న వారికి, జ్ఞానబోధ చేసి సన్మార్గంలో నడిపేదాన్ని. పిల్లలకి ఓనమాలు నేర్పే అయ్యవార్లకు కూడా నేను పాఠాలు చెప్పేదాన్ని. సమాజ శ్రేయస్సుకోసం తపించే వారి చేతులలో పూతమై, వారికి సన్మార్గం చూపి.. వారిని మంచివైపు నడిపించుకు వెళ్ళేదాన్ని. అక్షరాన్ని పట్టుకుని అంతరిక్షం దాకా వెళ్ళే శాస్త్రవేత్తలకు సైతం నేనో దారిదీపాన్ని అయ్యేదాన్ని. గొప్ప గురువులకు కూడా నేనే అమ్మలా అక్షరాలను నేర్పేదాన్ని. ఇప్పుడవన్నీ పాత కథలైపోయాయి.. ఎవరూ తుడవని కన్నీళ్ళుగా మిగిలిపోయాయి.

మీకు గుర్తుందా!.. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ భరతజాతి విముక్తి కోసం ప్రజా చైతన్యానికి నేనే అక్షరకేతనమయ్యా. ఉద్యమాలకు ఉగ్గుపాలనయ్యా. స్వాతంత్ర్యవీరులకు సమాచారం అందించేందుకు పత్రికనయ్యా. కరపత్రాల రూపంలో కరదీపికలనయ్యా. గోడలెక్కి మరీ సమాచార వీచికనయ్యా !.. జనవిజ్ఞానం కోసం తపిస్తూ వికసించే పువ్వుల్లాగా ఊరూవాడా గ్రంథాలయాలలో కొలువయ్యా.

అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి మహనీయుల పుణ్యమా అంటూ తెలుగునాట ప్రజలకి, ప్రజా ఉద్యమాలకీ, వారి అజెండాలకి నేనో జెండానై వారివెంట నడిచా. కారాగారాల్లోనూ పోరాటయోధుల చేతుల్లో అక్షర సూచికనై ఒదిగిపొయ్యా..! అడవిబాపిరాజు, గుడిపాటి వెంకటచలం, కాళీపట్నం రామారావు, కొడవటిగంటి కుటుంబరావు, కొమ్మూరి సాంబశివరావు వంటి పాతరం రచయితలని మనమెప్పటికీ మరువలేము. మహాకవి శ్రీశ్రీ, ప్రసిద్ధ కవులు గుంటూరు శేషేంద్రశర్మ, ఆరుద్ర, డా. సి.నారాయణరెడ్డి, ఆత్రేయ, వేటూరి, మల్లెమాల వంటి మహాకవులకి మనకి కొదవలేదు. ప్రఖ్యాత నవలాకారులుగా పేరొందిన యండమూరి వీరేంద్రనాథ్, చల్లా సుబ్రహ్మణ్యం, మధుబాబు, సూర్యదేవర రామ్మోహన్‌రావు వంటి దిగ్గజాలెందరికో తెలుగునేల పుట్టినిల్లు. వారందరి రచనలని బాహ్యప్రపంచానికి అందించిన అదృష్టం నా ఒక్కదానికే దక్కింది.

నా రూపంలో బయటకొచ్చిన వారి రచనలెన్నో సినిమాలుగా విడుదలై వెండితెరపై ఒక వెలుగు వెలిగాయి. ఊహించని విజయాలని సాధించి చరిత్ర సృష్టించాయి.

### ప్రాచీన చరిత్రకి మిగిలిన ఏకైక ఆధారం నేనే..!

వేలాది సంవత్సరాల చరిత్ర ఉన్న మన భారతీయ సంస్కృతులని, సంప్రదాయాలని, ఆచారాలని గడచిన తరాలకి అందిస్తూ వస్తున్నది నేనే. ఆ ప్రాచీన చరిత్రకి మిగిలిన ఏకైక ఆధారం కూడా నేనే. భవిష్యత్ తరాలకి అందించబోయేది కూడా నేనే అని ఆశపడ్డాను. కానీ, నా ఆశలన్నీ అడియాసలే అవుతున్నాయి. నా ప్రాధాన్యత తగ్గిపోతోంది. అంతర్జాల సామ్రాజ్యంలో గ్రంథాలయాలకు వచ్చే వాళ్ళే కరువైపోయారు. నన్ను చేతబట్టి ఓపిగ్గా తిరగేసేవారి సంఖ్య గణనీయంగా పడిపోతోంది. ప్రభుత్వ గ్రంధాలయాలు సైతం మూతబడిపోతున్నాయి. మనసు ఫౌండేషన్ వంటి సంస్థలు కంప్యూటర్లలో నా స్వరూపాన్ని అపురూపంగా తయారుచేసి అంతర్జాలంలో అందిస్తున్నాయి. ఓ విధంగా నన్ను సమాజానికి పూర్తిగా దూరం కానీయకుండా కాపాడుతున్నాయి.

### నన్ను బ్రతికించండి.. నా ఉనికిని కాపాడండి..!


నా పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. శాంతా – వసంత ట్రస్టు వ్యవస్థాపకులు కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి వంటివాళ్ళు నాకు ఎప్పటికప్పుడు కొత్త రూపాన్ని కల్పిస్తున్నారు. వివిధ సందర్భాలలో నాకు అందమైన రూపాన్ని ఇచ్చి సమాజానికి అందిస్తున్నారు. నేనింకా బ్రతికే ఉన్నానని సాహితీ ప్రపంచానికి చాటి చెప్తున్నారు. "చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఓ మంచి పుస్తకాన్ని కొనుక్కో" అని పెద్దలు ఏనాడో చెప్పారు. ఇప్పుడు నన్ను కొనుక్కునే వాళ్ళు లేరు సరికదా భవిష్యత్తులో నన్ను కనుక్కొనే వాళ్ళు కూడా ఉండరేమో అని నాకు దిగులేస్తోంది. వరప్రసాద్‌రెడ్డి లాంటి చాలామంది సాహితీప్రియులు నన్ను అందంగా అలంకరించి, చూడముచ్చటగా ముస్తాబు చేసి నేనంటే ఇష్టపడేవారికి నన్ను ఉచితంగానే ఇస్తున్నారు. నాకు కొత్త ఆశలు కల్పిస్తున్నారు. నన్ను నన్నుగా తయారు చేయడానికి, రచయితలు, రచయిత్రులు, కవులు, సాహితీవేత్తలూ పడే ఆరాటం అంతా ఇంతా కాదు. వారి మదిలో మెలిగే ఆలోచనలకి, భావాలకి, అనుభూతులకి అక్షరాలని ఏర్చి, కూర్చి, పేర్చి వాటికి సజీవరూపం కల్పించి నాలో భద్రపరుస్తారు. నన్ను సమాజానికి అందిస్తారు. ఇప్పుడు అలా అందించేవారి సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతోంది. చాలామంది నన్ను పక్కనపడేసి తమ రచనా వ్యాసంగాలని అంతర్జాలానికే పరిమితం చేస్తున్నారు.

సాహితీవేత్తలకు, సాహితీప్రియులకి, మేధావులకు నా విన్నపం ఒక్కటే. నన్ను బ్రతికించండి. నా ప్రాధాన్యతని, ప్రాముఖ్యతని భవిష్యత్ తరాలవారికి తెలిపి.. నా అవసరం పట్ల వారికి చైతన్యం కల్పించండి. చెదలు పట్టి శిథిలమైపోతున్న నా బ్రతుకుకి ఊపిరి పోయండి. నా ఉనికిని కాపాడండి. ఇది నా విన్నపం!

"ఇదీ పుస్తక విలాపం."

- రాజశ్రీ

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు పెద్దలు. నిజమే మరి!.. ఆకలైనవారికి అన్నం పెట్టడం కంటే పుణ్యకార్యం ఏముంటుందీ!..దాతృత్వానికి మారుపేరుగా ఉన్న నెల్లూరుజిల్లాలో దాతలకు కొదవే లేదు. అయితే, అన్నం పెట్టే అన్నదాతలు మాత్రం ఏ కొద్దిమందో ఉన్నారు. అలాంటి వారిలో అగ్రగణ్యులు మన పరమేశ్వరుడు..అంతేకాదు, ఆపదలో ఆదుకునే దాత కూడా ఆయనే. నేటికీ ఆయన తన స్వస్థలమైన ఆత్మకూరులో పేదోళ్ళెవరైనా మరణిస్తే, వారి కుటుంబాలకు సాయంగా 10వేల రూపాయల వంతున అందజేసి వారిని ఓదారుస్తుంటారు. అటు అన్నదానాలకు, ఇటు అసహాయులను ఆదుకునేందుకు ఆయన చేసిన దానాలు లక్షలు దాటి కోట్లలోకి వెళ్లాయంటే అతిశయోక్తి కాదు. మానవీయతకు మారుపేరైన కంచి పరమేశ్వరరెడ్డి, 'జననీ జన్మభూమిశ్చ అన్నట్లుగా, జన్మభూమికి తనవంతు సేవలందిస్తూ అందరి అభిమానానికీ పాత్రులవుతున్నారు.



# ఆకలైనవారికి అన్నం పెట్టే.. 'పరమేశ్వరుడు'!







ధనం చాలామంది వద్ద ఉంటుంది. కానీ దానిని పదుగురికోసం వెచ్చించే గుణం మాత్రం ఏ కొందరికో ఉంటుంది. అలాంటి దానగుణం ఉన్నవారినే మనం దాతలు అంటుంటాం. జిల్లాలో అనేక ప్రాంతాల్లో గొప్పగొప్ప దాతలెందరో ఉన్నారు. అయితే, మెట్ట ప్రాంతమైన ఆత్మకూరులో పుట్టిన మహాదాత ఎవరయ్యా అంటే, అందరూ ముందుగా 'కంచి' పేరే చెప్పి, ఆయన మంచిని వేనోళ్ల కీర్తిస్తుంటారు.

ఆయన పూర్తిపేరు కంచి పరమేశ్వర రెడ్డి. చిన్నతనంలో కష్టాలు పడిన వ్యక్తి. ఆ తర్వాత జీవనయాత్రలో వ్యాపార రంగంలోకి దిగి ప్రముఖ వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే ఆత్మకూరు నుంచి వెళ్ళి హైదరాబాదులో స్థిరపడ్డారు. అయితే, తన పుట్టిన ఊరును, అక్కడి ప్రజలను ఏనాడూ మరచిపోలేదు. రెండేళ్ళ క్రితం ఆత్మకూరుకు వచ్చినప్పుడు, అక్కడ వందపడకల ప్రభుత్వాసుపత్రికి వస్తున్న నిరుపేదలు, వారి వెంట వచ్చే సహాయకులు సమయానికి అన్నం దొరక్క ఇబ్బందులు పడడం చూసి, ఆయన చలించిపోయారు. ఆకలితో ఉండే నిరుపేదలకు అన్నం పెట్టాలని నిర్ణయించుకుని సుమారు 70 లక్షలదాకా వెచ్చించి ఆసుపత్రి వద్దనే భోజనశాలను కట్టి, రోజుకు దాదాపు 850మంది దాకా నిరుపేదలకు అన్నదానం చేస్తున్నారు. అంతకు మించిన జనం వచ్చినా అన్నం లేదనేది ఉండదు. అన్నదానమంటే ఏదో ఒక కూర పచ్చడి వేసి సరిపెట్టడం కాక, నాలుగైదు రకాల కూరలతో, నాణ్యమైన ఆహారపదార్థాలతో రుచిగా-శుచిగా ఒక విందుభోజనంలా పెడుతున్నారాయన. అందుకు ఎంత డబ్బు ఖర్చయినా ఆయన వెనుకాడరు. వారంలో కనీసం రెండురోజుల పాటు ఆయన హైదరాబాదు నుంచి ఆత్మకూరుకు వచ్చి స్వయంగా అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించి వెళ్తుంటారు. ఆయన సేవాభావం చూసి ఆత్మకూరులోని అనేక సంఘాల వారు, మహిళలు ఆ అన్నదానశాలకు వచ్చి వంటలు వండడం లోనూ, అన్నం పెట్టడంలోనూ తమవంతు సహకరిస్తుంటారంటే ఆయన సేవలు ప్రజల్లో ఎంత గుర్తింపు పొందాయో అర్ధమవుతుంది. ఇప్పటిదాకా కనీసం మూడున్నర లక్షల మందికి ఈ అన్నప్రసాద వితరణ జరిగి ఉంటుందని అంచనా.

## మృతుల కుటుంబాలకు ఆపన్నహస్తం

ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో ఎవరైనా పేదలు మరణిస్తే, వారి అంత్యక్రియల కోసం డబ్బులకు ఇబ్బందులు పడకుండా, ఆయా కుటుంబాలకు వెంటనే 10వేల రూపాయల వంతున ఆర్థికసాయం అందించడమే కాక, స్వయంగా ఆయన, లేదా ఆయన తరఫున మిత్రులు వెళ్ళి ఆ కుటుంబాలను ఓదారుస్తుంటారు కూడా. ఇప్పటివరకు సుమారు 201 మంది మృతుల కుటుంబాలకు ఆయన 20 లక్షలా 10వేల రూపాయలను సాయంగా అందించారు. అంతేకాదు, బంధువులంతా వచ్చే దాకా మృతదేహాలను ఉంచేందుకు సుమారు 5 లక్షల రూపాయలు వెచ్చించి 6 ఫ్రీజర్‌బాక్స్‌లను తెప్పించి వాటిని ఆత్మకూరు మండలం వారికే కాక, ఏఎస్‌పేట ప్రజల అవసరాలకు కూడా కేటాయించారు. భౌతికకాయాలను స్మశానానికి తీసుకువెళ్ళేందుకు అవసరమైన వాహనాన్ని (కైలాసరథం) కూడా 10 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటుచేసి, అవసరమైన వారికి ఉచితంగానే పంపుతున్నారు.

## మానవ సేవే.. మాధవసేవగా...

దైవ కార్యక్రమాలంటే ముందుంటూ, వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఆయనకెంతో ఇష్టం. అనేక ఆలయాలు, మసీదులు, చర్చిలకు కూడా ఆయన తనవంతు చేయూతనందిస్తుండడం విశేషం. మానవ సేవే.. మాధవ సేవగా భావించి.. మంచినీళ్ళ కోసం అవస్తలు పడుతున్న ప్రజల కోసం 'జల ప్రసాదం' కార్యక్రమం ద్వారా తన వితరణతో మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారాయన. 10వ తరగతిలో మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులిస్తుంటారారు. ఏదేమైనా, కంచి పరమేశ్వరరెడ్డి వంటి వారి నిస్వార్ధ సేవలు జిల్లాకు గర్వకారణం. 'కంచి' వంటి మంచి అన్నదాతలు మన జిల్లాలో ఉండడం జిల్లా అదృష్టమే మరి!..

కాగా, కంచి పరమేశ్వరరెడ్డి కుమార్తె, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుమార్తె.. ఇద్దరూ ఒకే ఇంటి కోడళ్లు కావడం విశేషం!


మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి పదకొండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి
సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు
లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు - మనుమరాండ్రు | | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ | సోమిరెడ్డి అగస్త్య | |



స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు
W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
జననం: 1938 నిర్యాణం: 15-01-2014



# 'నల్లారి'తో 'ఆనం' భేటీ!

మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 6న నెల్లూరుకు వచ్చినప్పుడు ఆర్ అండ్ బి అతిథిగృహంలో రాష్ట్ర దేవా దాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, ఆయన క్యాబినెట్లో ఆనం రామ నారాయణరెడ్డి ఆర్థికశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ అనుబంధంతో గౌరవపూర్వకంగా ఆయన్ను కలుసుకున్నట్లు ఆనం చెప్పారు. వారి వెంట ఆనం రంగమయూర్‌రెడ్డి కూడా ఉన్నారు.

# అజీజ్‌కి..శ్రీధర్‌రెడ్డి ఆత్మీయ సన్మానం



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈనెల 5న నెల్లూరులోని తన కార్యాలయంలో ఆత్మీయంగా సన్మానించారు. తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి తదితర నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, అజీజ్ మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అజీజ్ మాట్లాడుతూ, శ్రీధర్‌రెడ్డి నిరంతర ప్రజాసేవకుడని, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల సేవే ధ్యేయంగా ఆయన రూరల్ నియోజకవర్గ ప్రజలకు అహర్నిశలు సేవలందిస్తున్నారని కొనియాడారు. నెల్లూరురూరల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడమంటే సామాన్యమైన విషయమేమీ కాదని, ఆ ఘనత శ్రీధర్‌రెడ్డికే దక్కిందని ప్రశంసించారు. గతంలో తాను నెల్లూరు మేయర్ కావడానికి శ్రీధర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. తొలుత కోటంరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో నగరంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి విగ్రహం కూడలి వద్ద నుంచి పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.



## సాయినాథుని క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు బాలాజీ నగర్ శివారులోని అద్దాల సాయిబాబా మందిరంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మందిరం కమిటీ ఛైర్మన్ మధుసాయి.

# నెల్లూరు కబుర్లు

# 'వన్ మ్యాన్ కమిషన్'కు అర్జీల వెల్లువ



ఎస్సీ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి విజ్ఞప్తులను స్వీకరించేందుకు ఈనెల 4న నెల్లూరుకు వచ్చిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీప్రజలు, కుల సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో అర్జీలు అందజేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అధికారులతో కమిషన్ ఛైర్మన్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సీ ప్రజలు, సంఘాల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. పలువురు కుల సంఘాల నేతలు తమ అభిప్రాయాలను కమిషన్ ఛైర్మన్ ఎదుట వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎఎస్పీ సౌజన్య, డిఆర్ఓ ఉదయ్ భాస్కర్, కమిషన్ జిల్లా పర్యటన లైజనింగ్ అధికారి, ఏపీఎంఐపి పీడీ శ్రీనివాసులు, సోషల్‌వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పాల్గొన్నారు.

# కోడిపందాలు నిర్వహించొద్దు!

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా కోడి పందాలు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 7న కలెక్టరు తన చాంబర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతుహింస నివారణ చట్టం అమలుపై ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించడం నేరమన్నారు. కోడిపందాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేసి కోడిపందాలు నిర్వహించకుండా చూడాలని ఆదేశించారు. ఈ కమిటీల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సభ్యులుగా వుండి గ్రామాల్లో కోడిపందాలు, ఇతరత్రా ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డిఎఫ్ఓ మహబూబ్‌బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఏ.డి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

## నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, చదువుకు క్రీడలు తోడైతే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈనెల 5న స్థానిక నారాయణ వైద్యకళాశాల ఆవరణంలో జరిగిన ఆ విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే క్రీడాకారులుగా ఉంటే, మానసిక వత్తిళ్ళను నివారించుకోవచ్చని, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండవచ్చని అన్నారు. అనంతరం కబడ్డీ ఖోఖో, త్రోబాల్, రన్నింగ్‌రేస్ తదితర క్రీడల్లో గెలుపొందిన వారిని అభినందించారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆదిశేషయ్య, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర మొదలైందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 7వ తేదీన ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అయ్యప్పగుడి నుండి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు దాదాపు 2కోట్ల 52 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను తన సోదరుడు.. టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వ ఆర్థిక విధానాలతో రాష్ట్రం పూర్తిగా దివాళాతీసిందని, వైకాపా నాయకులు అభివృద్ధి, పేరుతో టెంకాయలు కొట్టారు తప్ప, పనులు మాత్రం ప్రారంభం కాలేదని విమర్శించారు. నేను టెంకాయలు కొట్టానంటే ఆ పనులు పూర్తి కావలసిందేనన్నారు. మనం చేసేదే ప్రజలకు చెప్పాలన్నదే తన అభిమతమన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, కార్పొరేటర్ భీమినేని మురహరి, టీడీపీ నాయకులు చెక్కా సాయి సునీల్ పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం.. 10.17 లక్షలు

నెల్లూరు మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం హుండీలను ఇటీవల లెక్కించారు. గత ఏడాది సెప్టెంబరు 13 నుంచి ఈనెల 2వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 10,17,459 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఓ శ్రీనివాసరావు తెలిపారు. పూడిపర్తి శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఇఓ శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో హుండీలెక్కింపు జరిగింది.


# ఫిబ్రవరి 1 నుంచి..సీపీఎం రాష్ట్ర మహాసభలు

ఫిబ్రవరి 1 నుంచి మూడురోజుల పాటు నెల్లూరు నగరంలో సీపీఎం రాష్ట్ర మహాసభలు పెద్దఎత్తున జరుగనున్నాయని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సీపీఎం ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొంటారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈసభల సందర్భంగా ఫిబ్రవరి 3న భారీర్యాలీ జరుగుతుందని, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు కూడా పాల్గొంటారని తెలిపారు. సీపీఎం మద్దతుదారులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, మూలి వెంగయ్య, మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వీఎస్‌యులో జాబ్‌మేళా

నెల్లూరు సమీపంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఇటీవల జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 47 మంది హాజరు కాగా, అందులో 18 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విఎస్‌యు వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ కె.సునీత, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం, కోఆర్డినేటర్ డా. జె.విజేత, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్ పర్యవేక్షించారు.

# 'ఆర్ఎస్ఆర్'కి.. వైకాపాలో కీలక పదవి



దాదాపు 3 దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ, పార్టీకి అంకిత భావంతో పని చేస్తున్న రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్)ని ఇటీవల వైకాపా అధిష్టానం జిల్లా అధికార ప్రతినిధిగా కీలక పదవిలో నియమించింది. నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసే నాయకునిగా ఆర్ఎస్ఆర్ మంచిపేరు సంపాదించుకున్న నేపథ్యంలో, తనకు పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా పదవినివ్వడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనకు గౌరవప్రదమైన ఆ పదవి వచ్చేందుకు సహకరించిన సీనియర్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డికి, తదితర నాయకులకు ఆర్ఎస్ఆర్ తన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# దశలవారీగా సూపర్‌సిక్స్ పథకాల అమలు

## - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి దిశగా పురోగమిస్తుందని, అటు రాష్ట్రాభివృద్ధి, ఇటు ప్రజాసంక్షేమమే తెలుగుదేశం పార్టీ అజెండా అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం పంచాయతి పరిధిలోని సాలుచింతల సెంటర్ మసీదు వీధిలో 8 లక్షల 50 వేల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు ఆమె ఈనెల 7న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథ కాలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుడుతున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం రాకుండా సంక్షేమ పథకాలు అమలుచేసే సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. అప్పుల భారంతో అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టికి నోచుకోని గుంతల రోడ్ల దుస్థితి సంక్రాంతి నాటికి మెరుగవుతుందని తెలిపారు. దశల వారీగా సూపర్‌సిక్స్ పథకాలు కూడా అమలవుతాయన్నారు. 12 కోట్ల 50 లక్షల రూపాయలు వెచ్చించి నియోజకవర్గవ్యాప్తంగా చేపట్టే అభివృద్ధి పనుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భాగ స్వాములు కావాలని ఆమె కోరారు. నెల్లూరు జిల్లాకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ రాకతో వేలసంఖ్యలో యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు.

### స్కూల్ బస్సు ప్రమాదంపై ఎమ్మెల్యే ఆరా :

బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు రోడ్డు వద్ద సోమవారం స్కూల్ బస్సు ప్రమాదానికి గురవడంపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. గాయపడిన పిల్లల ఆరోగ్యం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గాయాల పాలైన క్రాంతిసందేశ్ అనే విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.



# గిరిజనుల బాగుకే.. తొలి ప్రాధాన్యత!

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జిల్లాలో గిరిజనులు ఎన్నో కష్టనష్టాలతో జీవిస్తున్నారని, వారి బాగుకే తన తొలి ప్రాధాన్యత ఉంటుందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. గిరిజనులకు కనీసం ఆధార్ కార్డులు కూడా ఇప్పించకుండా సచివాలయ ఉద్యోగులు ఏం చేస్తున్నట్లని ఆయన ఆవేదనతో ప్రశ్నించారు. ఆధార్‌కార్డులు లేకపోవడంతో వారు రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలను కూడా పొందలేకపోతున్నారన్నారు. ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయతీ చిన్నసంగం గిరిజన కాలనీలో ఆయన ఇటీవల పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గిరిజనుల సమస్యలపై ఆరా తీయడంతో పాటు మనుమళ్లతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా స్థాయిలోనూ గిరిజనుల సమస్యల పరిష్కారంపై ఉన్నతాధి కారులు ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. తాను ఇటీవల ఒక్క పైనాపురం పంచాయతీ లోనే సుమారు 70 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో పాటు 80 మందికి ఆధార్‌కార్డులు నమోదు చేయించానని, మరో 17 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామని తెలిపారు. గిరిజనుల అవసరాలు తీర్చలేని సచివాలయాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. గిరిజన బిడ్డలు తప్పనిసరిగా బడికి వెళ్లడంపైనా అందరూ శ్రద్ధ వహించాలని కోరారు. త్వరలోనే తాము గిరిజనులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇళ్లు కట్టిస్తామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడంతో పాటు గిరిజన కాలనీల్లో ప్రత్యేక వసతులు ఏర్పాటుచేస్తామని చెప్పారు.

## కళాంజలి అనంత్ దర్శకత్వంలోని..

# 'పండుటాకులు'కు మళ్లీ 3 అవార్డులు





నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ రచయిత-దర్శకుడు 'కళాంజలి అనంత్' దర్శకత్వంలో రూపొందించిన 'పండుటాకులు' షార్ట్ ఫిల్మ్‌కు తాజాగా మళ్ళీ 3 అవార్డులు లభించాయి. హైదరాబాద్‌కి చెందిన పద్మశ్రీ భానుమతి రామకృష్ణ మెమోరియల్ ఆర్ట్స్ అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్‌ల పోటీల్లో కళాంజలి అనంత్ దర్శకత్వం లోని 'పండుటాకులు' ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకుంది. అంతేకాక, ఉత్తమ మాటల రచయితగా డా. కెకె రామచంద్ర మూర్తి, ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా మునిచంద్రకు అవార్డులు వచ్చాయి. ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లోని ఫిల్మ్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ప్రెసిడెంట్ పోతాని రామకృష్ణగౌడ్, విశ్రాంత డీజీపీ గోపీనాథ్‌రెడ్డి చేతుల మీదుగా నటులు మునిచంద్ర, కెకె రామచంద్రమూర్తి పాల్గొని ఆ అవార్డులను అందుకున్నారు.

అదేసంస్థ వారు నిర్వహించిన పాటల పోటీల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు.. ఏ.లక్ష్మీప్రసన్న శిష్యురాలు, 'పాడుతా తీయగా' గాయని.. ఐవిఎన్ఎస్ జ్ఞానశ్రీకి ద్వితీయ బహుమతి లభించడం మరో విశేషం.

### గతంలోనూ పలు అవార్డులు :

'పండుటాకులు' షార్ట్ ఫిల్మ్‌కు గతంలోనూ పలు అవార్డులు వచ్చాయి. ఉత్తమ దర్శకునిగా అనంత్, ఉత్తమ నటుడిగా ధనుంజయ జాతీయస్థాయి అవార్డులు సాధించారు. హైదరాబాద్‌లోని 'వీ-వరల్డ్ స్టూడియోస్' ఆధ్వర్యంలో 2023లో జరిగిన షార్ట్‌ఫిల్మ్‌ల పోటీల్లో 'పండుటాకులు'కు ఆ అవార్డులు లభించాయి. అదే విధంగా, గతంలో మహాకవి గుర్రం జాషువా 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన 'తెలుగు వైతాళికుల స్ఫూర్తి సంబరాలు'లో కూడా ఈ షార్ట్‌ఫిల్మ్‌కు ఉత్తమ దర్శకునిగా కళాంజలి అనంత్‌కు మొదటి కన్సొలేషన్ బహుమతి లభించింది. 2024లో అనంతపురం ఫిల్మ్ సొసైటీ వారు నిర్వహించిన షార్ట్ ఫిల్మ్‌ల పోటీల్లో పండుటాకులు ప్రత్యేకబహుమతి అందుకుంది.

### సందేశాత్మక చిత్రం..'పండుటాకులు' :

నేటి సమాజంలో తల్లితండ్రులు పడుతున్న బాధలను, వృద్ధాప్యంలో వారు అనుభవిస్తున్న కష్టాలను చిత్రీకరిస్తూ, జన్మనిచ్చిన తల్లితండ్రులను బిడ్డలు ఆదరించాలని, తమ జీవి తాలకు పట్టుగొమ్మలుగా నిలిచిన తల్లితండ్రులను వారి బిడ్డలు ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బంది పెట్టకూడదని, వృద్ధాశ్రమా లకు పంపి వారిని మరింత వేదనకు గురిచేయకూడదని.. తెలియజెప్పే చిత్రమే..'పండుటాకులు'. అసలే కష్టాలతో పండిపోయి పండు టాకులుగా మిగిలిన ఆ వృద్ధ తల్లితండ్రు లను ఆప్యాయంగా ఆదరించాలని హితవు పలికే సందేశాత్మక చిత్రమే.. 'పండుటాకులు'!.. బందాలు అనుబంధాలు, రక్త సంబంధాలకు ప్రతీకగా నిలిచిన ఈ చిత్రం ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. అందరినీ ఆకట్టుకునే కథా కథనంతో ఈ షార్ట్ ఫిల్మ్‌ను కళాంజలి అనంత్ అద్భుతంగా తీర్చిదిద్దారు. ఒక్కమాటలో చెప్పాలంటే అనంత్ దర్శకత్వ ప్రతిభకు ఇదొక నిదర్శనం. ఈ షార్ట్‌ఫిల్మ్‌కు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అన్నీ అనంతే. అనంత్‌తో పాటు ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతికవర్గం వారంతా నెల్లూరు కళారంగంలో అందరికీ సుపరిచితులే. ప్రత్యేకించి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత, 'నంది అవార్డు' గ్రహీత డా. కెకె రామచంద్రమూర్తి రాసిన సంభాషణలు హృదయాలను ఆకట్టుకుం టాయి. పండుటాకులు షార్ట్‌ఫిల్మ్‌లో ప్రముఖ నటులు ధనుంజయ, పార్వతీశం, మునిచంద్ర, దువ్వూరు బెనర్జీ, డా. తేజ, కెకె రామచంద్రమూర్తి, డా.చెన్నకేశవ్, ప్రసన్నాంజనేయులు, నటీమణులు లహరి, అనూష తమ నటనాప్రతిభతో, పాత్రలకు తగ్గట్టుగా నటించి ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నారు. సంగీత్ సౌరభ్ సంగీతం, కృపానంద్ గానం అందరినీ ఆకట్టుకుంటాయి. బ్యాక్‌గ్రౌండ్‌స్కోర్ అందించిన(ఆర్‌ఆర్) చైతన్య అభినం దనీయులు.

గతంలో కూడా పలు సందేశాత్మక షార్ట్ ఫిల్మ్‌లు, టెలీఫిల్మ్‌లు రూపొందించి అందరి అభినందనలు అందుకున్న కళాంజలి అనంత్ దర్శకత్వంలో, ప్రత్యే కించి 'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డుల మీద అవార్డులు రావడం జిల్లాకే గర్వకారణమంటూ నెల్లూరు కళాకారు లంతా ఆయన్ను అభినందిస్తున్నారు.







## బడిపిల్లల మధ్యాహ్న భోజనం..

# అమ్మ చేతి వంటలా ఉండాలి

**- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



బడిపిల్లల మధ్యాహ్న భోజనం..అమ్మ చేతి వంటలా ఉండాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మంచి రుచి-శుచి కలిగిన భోజనం పెట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాఠశాల నిర్వాహకులకు చెప్పారు. ఇటీవల ఆమె కోవూరులోని జెట్టి బలరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న మధ్యాహ్న భోజన నాణ్యతను ఆమె పరిశీలించారు. విద్యార్థినీ, విద్యార్థులకు స్వహస్తాలతో ఆమె భోజనం వడ్డించారు. విద్యార్థినులతో కలిసి భోంచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఆమె ధన్యవాదాలు తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి విద్యార్థుల నుంచి కానీ, వారి తల్లితండ్రుల నుంచి కానీ ఎలాంటి ఫిర్యాదుల రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదేనని పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అప్పుడప్పుడూ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించాలని కోరారు.

# శ్రద్ధగా చదవండి.. లక్ష్యాన్ని చేరుకోండి..!

• హాస్టల్ విద్యార్థులతో ఎమ్మెల్యే కాకర్ల



ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు శ్రద్ధతో బాగా చదువుకుని, అనుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల ఆకాంక్షించారు. నూతన సంవత్సరారంభం సందర్భంగా ఇటీవల ఆయన వింజమూరులోని బీసీ, ఎస్సీ, వసతి గృహాల విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. పేదరికాన్ని జయించాలి అంటే చదువే సరైన మార్గమన్నారు. ఆయనతో పాటు మాలపాటి చైతన్య, ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తల్లిని పూజించుకోవాలి

**○ మాతృమూర్తి సేవా పురస్కారాల సభలో వక్తలు**

తల్లితండ్రులను బిడ్డలు ప్రేమగా చూసుకోవాలి, జన్మనిచ్చిన తల్లిని దైవంగా పూజించుకోవాలని, వృద్ధులైన అమ్మానాన్నల పట్ల మరింత ఆత్మీయతతో ఉండాలని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన అల్లూరులో ఈనెల 6న రామకృష్ణా జూనియర్ కళాశాల మైదానంలో కెయస్ఆర్ ఫౌండేషన్ వారి వేదికపై మేడా బుజ్జమ్మ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ (విశాఖపట్టణం) వారి ఆధ్వర్యంలో పలువురికి మాతృమూర్తి సేవాపురస్కారాలను ప్రదానం చేశారు. మాతృమూర్తుల సేవలో తరిస్తున్న ఈదూరు కృపావతి, మంగళపూడి శ్రీనివాసులురెడ్డి, కాకాని మల్లికార్జున, మద్దాలి రఘు నాగప్రసాద్, కుమ్మరగుంట లక్ష్మయ్యలకు ఈ పురస్కారాలను నిర్వాహకులు బహుకరించారు. కారుమంచి కార్తీక్ శర్మ వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ట్రస్ట్ ఛైర్మన్ మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కన్నతల్లి మేడా బుజ్జమ్మ ఆశయాలకు అనుగుణంగా మాతృమూర్తి సేవా పురస్కారాలను తన జన్మస్థలమైన అల్లూరు గ్రామంలోనూ, ఇప్పుడు తాను నివసిస్తున్న విశాఖపట్నంలోను గత ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. తల్లితండ్రులను ప్రేమతో చూసుకొంటే వృద్ధాశ్రమాల అవసరం ఉండదని ఆయనన్నారు. జన్మనిచ్చిన తల్లిని దైవంగా పూజించాలన్నారు. విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు అవధాని కోట రాజశేఖర్ సభకు అధ్యక్షులుగా వ్యవహరిస్తూ 'మాతృదేవోభవ' అనే సూక్తిలోని విశిష్టతను విశదీకరించి, అమ్మ ప్రేమను తెలియజెప్పే పద్యాలను గానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. విక్రమ సింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా. కనుమూరి సునీత, ప్రముఖ రంగస్థల, సినీనటుడు తమ్మినేని జనార్దన్, ప్రముఖ న్యాయవాది గూడూరు లక్ష్మి, దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేడా కృష్ణారెడ్డి, పెనాక సుజాత తదితరులు పాల్గొన్నారు. తొలుత, అమ్మ గొప్పతనాన్ని తెలియజేసే సినీగీతాలను కంచుపాటి విజయలక్ష్మి, ప్రవీణ్‌లు హృద్యంగా గానం చేశారు. దుద్దుకూరు భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

### ఆక్రమణలో ఉన్న భూములను..

# తిరిగి పేదలకు ఇప్పిస్తా



**- ఎమ్మెల్యే సునీల్**

కోట మండలం, కేశవరం గ్రామంలో ఇటీవల రెవెన్యూ సదస్సు భారీ స్థాయిలో నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేశవరం రెవెన్యూ గ్రామంలో నిరుపేదల భూములను కొందరు దౌర్జన్యంగా లాక్కున్నారని, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా విచారణ జరిపి తిరిగి ఆ భూములను పేదలకు ఇప్పించాలని కోరారు. నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పి.భాస్కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఆవశ్యకతను గుర్తించాలి



గూడూరులోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో "సైన్స్ సింపోజియం''ను ఎంఎల్ఏ డా. పాశం సునీల్ కుమార్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచమంతా సైన్స్ ఆవశ్యకతను గుర్తించి, పరిశోధనల్లో అనేక వస్తువులను సృష్టిస్తూ.. మానవ జీవితాలను ప్రభావితం చేస్తోందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు, అకడమిక్ డీన్ సునీల్‌రాజ్, అకడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా దయాకర్

గూడూరు బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కె.దయాకర్‌ను ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గూడూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు దయాకర్‌ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణంనాయుడు, నాయకులు కోటేశ్వరరావు, బిందురెడ్డి, రవీంద్రరాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మెట్టాని సత్కరించిన వైకాపా నాయకులు



ఉమ్మడి నెల్లూరు జిల్లా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మెట్టా రాధాకృష్ణారెడ్డిని వైకాపా నాయకులు పలువురు తిప్పవరప్పాడులోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. టౌన్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, జిల్లా నాయకులు నాశిన నాగులు, చోళవరం గిరిబాబులు, తిప్పవరప్పాడు గ్రామ సర్పంచ్ దాసరి పాల్గొన్నారు.

# డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా



సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం, గూడూరు ఆధ్వర్యంలో డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణిల దాతృత్వంతో ఇటీవల 20మంది పేద రెడ్డి బంధువులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నెలకు సరిపడా పలసరుకులు, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం, సంక్రాంతి అందరికీ నిండు ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాలను కలిగించాలన్నారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన రెడ్డి సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులు రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తన మనవడు పనబాక కార్తికేయన్ రెండవ పుట్టినరోజు సందర్భంగా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విద్యుత్ సంస్థ రిటైర్డ్ ఉద్యోగి పనబాక ఎతిరాజులు



# జానకిరామ.. రామాయణం 47

- ఊటుకూరు జానకి రామారావు



అంత రాముడు భరతునితో.. నాయనా ఉత్తమవంశంలో జన్మించినవాడు రాజ్యం కోసం పాపం చేయునా?

భరతా.. నీలో ఏవిధమైన దోషంలేదు, బాలుడి వలే నీ తల్లిని నీవు నిందించవద్దు. తన భార్యాపుత్రుల విషయంలో మన తండ్రి నిర్ణయాన్ని నీవు తప్పుపట్టవద్దు!. అంతేకాక మహారాజుగా ఆయనకు మనల్ని శాసించే అధికారముంది.

ధర్మశీలురైన నా తల్లితండ్రులు ఇరువురూ అరణ్యానికి వెళ్ళమని ఆజ్ఞాపించగా ఇంకొక విధంగా నేనెలా ప్రవర్తించగలను.

మన తండ్రి గారు నిన్ను అయోధ్యలో రాజ్యపాలన చేయమన్నారు, నన్ను దండకారణ్యంలో నివసించమన్నారు. ఇది ఆయన చేసిన పంపకం.

మహారాజు నిర్ణయమే ప్రమాణం. తండ్రిగారు నీకిచ్చిన భాగాన్ని నీవు అనుభవించు! నా కిచ్చిన భాగాన్ని నేను అనుభవిస్తాను.

అన్నా, మన వంశానికి ఉన్న ధర్మం, అనాదిగా అందరూ పాటించేది జ్యేష్ఠుడు రాజుగా బాధ్యతలు స్వీకరించడం, నేను ఆ విషయంలో ధర్మహీనుడను కాలేను. నాకు రాజ్యంతో పనిలేదు, నాకు దాని వలన ప్రయోజనమూ లేదు.

రామా నీవు మాతో కూడి అయోధ్యకు రావాలి! రాజ్యాభిషిక్తుడవు కావాలి.

మన తండ్రి గారు నిన్ను అడవికి పంపిన తరువాత నీ వియోగం వల్ల కలిగిన శోకం భరించలేక స్వర్గస్తులైనారు.

నా తల్లి మూలంగా ఆయన తన కీర్తిని శాశ్వతంగా నశింపచేసే ఈ పాపపు పనికి ఒడిగట్టినాడు.

నా తల్లి కోరింది రాజ్యం!

కానీ, ఆవిడకు లభించింది మాత్రం వైధవ్యం!

అన్నా!. నీవు సీతా లక్ష్మణసమేతుడవై అరణ్యానికి వెళ్ళిన వెంటనే ఆ బాధ భరించలేక, దుఃఖపీడితుడై దశరధమహారాజు స్వర్గస్థుడైనాడు.

రామా! లేచి తండ్రిగారికి జలతర్పణాలివ్వు! నేనూ శత్రుఘ్నుడూ ఇంతకుపూర్వమే ఆయనకు తర్పణాలు ఇచ్చాము.

నీవు దూరమైన పిదప నిన్నుగూర్చి ఆలోచిస్తూ, దుఃఖిస్తూ నిన్ను చూడాలని కోరుకుంటూ, నిన్ను స్మరిస్తూ నీయందే లగ్నమైన మనస్సును మరల్చలేక ఆయన మరణించాడు. ఆయనకు అపరక్రియలు చేయవలసినవాడవు, ఆయన ప్రియపుత్రుడవైన నీవే!.

ఇంతసేపటి తరువాత భరతుడు ఎరిగించిన తండ్రి మరణ వార్త విని రాముడు స్పృహతప్పి మూర్ఛపోయాడు.

తండ్రి మరణవార్త విని మొదలు నరికిన చెట్టులా కూలపడి బాలుడిలా రోదించసాగాడు రాముడు.

నా తండ్రి లేని అయోధ్యతో నాకేమి పని? అరణ్యవాసం అయిన పిదపకూడ నేను అయోధ్యలో కాలు పెట్టను. నాకిక మంచిమాటలు చెప్పేవారెవ్వరు? అయ్యో నేనెంత నష్ట జాతకుడను, నా వలన దుఃఖిస్తూ నా తండ్రి మరణించినాడే! కడసారి చూపుకు కూడా నోచని వాడనైనానే! భరతా! నీవు, శత్రుఘ్నుడు ఎంతో పుణ్యం చేసినారు కావున తండ్రిగారి అంత్యక్రియలు చేయగలిగారు... అని దుఃఖిస్తూ ఉన్న రాముడికి కర్తవ్యం గుర్తు చేశాడు భరతుడు.

సుమంత్రుడు వెంటరాగా రామలక్ష్మణులు ఇరువురూ కొండదిగి మందాకినిని సమీపించారు. బురదలేకుండా నిర్మలంగా ఉన్న రేవు చూసుకున్నారు. సుమంత్రుడు సాయం చేయగా అందులో మునకలు వేసి తండ్రికి జలతర్పణాలు విడిచి, ఇంగుదీకాయల పిండితో పిండప్రదానం చేసి భారమైన హృదయంతో మరల కొండ ఎక్కి తమ పర్ణశాలను చేరుకున్నారు.

అక్కడ అన్నదమ్ములు మరల ఒకరి నొకరు కౌగలించుకొని బిగ్గరగా రోదించసాగారు. వారి రోదనల ధ్వనికి మొత్తం అడవి అంతా కలతచెందింది.

ఏడుస్తున్న వీరిని తల్లులు దగ్గర చేరి ఓదార్చసాగారు.

కౌసల్యా మాత రాముని దగ్గరకు తీసుకొని ఆయన వంటికి అంటివున్న దుమ్మును మెల్లగా తుడుస్తూ ఆయన వీపు నిమరసాగింది.

రాముడు అంత అక్కడకు వచ్చిన జనులందరినీ పలకరించి కొందరిని కౌగలించుకొని వశిష్ఠమహర్షికి పాదాభివందనం చేసి ఆయన ప్రక్కన కూర్చున్నాడు.

అప్పుడు భరతుడు, లక్ష్మణ, శత్రుఘ్నులు అందరూ అన్న ప్రక్కనే ఆసీనులయ్యారు.

నిశ్శబ్దం తాండవిస్తోంది. జనమంతా కూడా రాముడు ఏం చెపుతాడా అని ఆసక్తిగా ఎదురు చూడసాగారు.

ఆ రాత్రి అంతా మరల రోదనలతోనే గడచిపోయింది!

మెల్లగా అందరూ హోమజపాదులు పూర్తిచేసుకొని మరల రాముని వద్దకు చేరారు.

మౌనాన్ని చీలుస్తూ భరతుడు అన్నమాటలు అందరికీ వినిపించాయి.

అన్నా! నా తల్లి మాట మన్నించి నాకు రాజ్యం ఇచ్చావు. దానిని నీకే తిరిగి ఇచ్చివేస్తున్నాను. స్వీకరించు! నిష్కంటకమైన రాజ్యాన్ని ఏలుకో! సువిశాలమైన ఈ సామ్రాజ్యాన్ని ఏలగల సమర్ధుడవు నీవే! మాకెవ్వరికీ అంత సమర్ధత లేదు.

నీ గమనం గరుడపక్షి వంటిది, మేమో.. మామూలు పిట్టల వంటి వాళ్ళం. నిన్ను అనుసరించే శక్తి కూడా లేని వాళ్ళం... అని భరతుడు పరిపరివిధాలుగా అన్నను ప్రార్ధించాడు, రోదించాడు.

అప్పుడు రాముడు, భరతా! నీవు ఈ విధంగా రోదించడం తగదు.

మనిషికి స్వాతంత్ర్యం కానీ, తన ఇష్టం వచ్చినట్లు పనులు చేసే సామర్థ్యం కానీ లేవు. ప్రతి ఒక్కడినీ దైవం అటూ ఇటూ లాగుతుంటుంది.

ఎంత పోగు చేసుకున్నా ధనం నశిస్తుంది, ఎంత ఉన్నతి పొందినా ప్రతిఒక్కడునూ పతనం చెందవలసిందే.

మనుష్యుల పరస్పర సంబంధాలు విచ్ఛిన్నం అయి తీరవలసిందే!

పుట్టినవాడు మరణించవలసినదే!

పండిన పండ్లకు చెట్టునుండి రాలిపోవడమే భయం.

అట్లే పుట్టిన మనిషికి గిట్టుట ఒకటే భయం.

ఎంత బ్రహ్మాండమైన ఆకాశహర్మ్యాలు, దృఢమైనవి అని నీవు అనుకుంటూ నిర్మించినా కొంతకాలానికి జీర్ణమై, శిధిలమై కూలిపోవలసిందే!

కాలానికి జీర్ణం చేసే శక్తి ఉంది!

గడచిన రాత్రి తిరిగి వస్తుందా!

మనిషిని ఆతని మృత్యువు ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. అది అతనితోటే కలిసి కూర్చుంటుంది, కలిసి ప్రయాణం చేస్తుంది.

ముఖం ముడుతలు పడి, వెంట్రుకలు నెరిసి, శిధిలమై పోతున్న శరీరాన్ని మనిషి తిరిగి సమర్ధవంతంగా చేసుకోగలడా! అది ఎవరి వల్లా కాదు.

సూర్యోదయమవ్వగనే పనులు చేసుకుంటూ చీకటి పడగానే నిదురిస్తూ ఉన్న మనిషి కాలంగడిచిపోతుంది అనే విషయాన్ని మాత్రం గమనించలేకున్నాడు.

ఋతువులు వస్తున్నాయి, పోతున్నాయి. దాంతోపాటే ప్రాణుల వయస్సు కూడా క్షీణిస్తుంది.

ఒక ప్రవాహంలో కొన్ని కట్టెముక్కలు కలిసివెళుతున్నాయి. కాస్తదూరం వెళ్ళగానే అవి విడిపోయి కనపడుతున్నాయి. కాలప్రవాహంలో జీవనగమనంలో బంధువులూ, స్నేహితులూ, భార్యాపుత్రులూ అలాంటి కట్టెముక్కల లాంటి వారే! అందరూ విడిపోక తప్పదు.

మన తండ్రి తన కర్తవ్యాన్ని నిర్వర్తించి స్వర్గం చేరుకున్నాడు.

మన తండ్రి నన్ను ఏమి చేయమని ఆజ్ఞాపించాడో, అది మాత్రమే నేను పాటిస్తాను.

దశరథమహారాజు మన తండ్రి, మన బంధువు. అది రాజాజ్ఞ! దానిని పాటించి తీరవలసిందే! అదే ధర్మం! మన తండ్రి ఆజ్ఞను మనం పాటించవలసినదే! ఆయన ఆజ్ఞ తిరుగులేనిది అని చెప్పి ముగించాడు రాముడు.

భరతా తండ్రి ఋణగ్రస్తుడైనప్పుడు ఆయన ఋణం తీర్చవలసిన బాధ్యత పుత్రులుగా మనపైన ఉందికదా!

"పుత్" అనే నరకం నుండి తండ్రిని తప్పిస్తాడు కావున పుత్రుడు అని పిలుస్తారు.

మన తండ్రి నీ తల్లిని వివాహం చేసుకొనే సందర్భంలో ఆమె కుమారునకు మాత్రమే రాజ్యమిస్తానని నీ తాతగారికి వాగ్దానం చేశారు.

దేవాసుర సంగ్రామం జరిగే సమయంలో నీ తల్లి చేసిన సేవకు మెచ్చి వరం కూడా ఇచ్చి ఉన్నాడాయన. ..(సశేషం)

# కృత్రిమ మేధకు కేంద్రంగా భారత్

## మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

మనసులో మాట 27

టెక్ ప్రపంచంలో, ముఖ్యంగా కృత్రిమ మేధ రంగంలో భారత్ ప్రస్థానం అద్భుతమైన మలుపు తిరగనుంది. భారత్‌లో మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడిని ప్రకటించింది. రాబోయే రెండేళ్ళలోనే 300 బిలియన్ డాలర్లు అంటే రూ.25,750,52,52,000- అక్షరాలా 25వేల 750 కోట్ల 52 లక్షల 52వేల రూపాయలు ఆ సంస్థ మన దేశంలో పెట్టుబడి పెట్టనుంది. భారత్ పర్యటనలో ఉన్న మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మంగళవారం బెంగళూరులో స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. కృత్రిమమేధకు సంబంధించిన మౌలిక సదుపాయాల రంగంలో, క్లౌడ్ రంగంలో, నైపుణ్య శిక్షణలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్‌లో ఇప్పటివరకు మైక్రోసాఫ్ట్ పెట్టిన పెట్టుబడుల్లో ఇదే పెద్దది. భారత్ మొత్తం విస్తరించేలా మధ్యభారత్‌లో, దక్షిణ భారత రాష్ట్రాల్లో, పశ్చిమ ప్రాంతంలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా డేటా కేంద్రాలు రానున్నాయి. కృత్రిమ మేధ రంగంలో డేటా కేంద్రాలదే కీలకపాత్ర. "భారత్‌ను కృత్రిమే మేధ ప్రాధాన్య దేశంగా మలచాలన్న మా సంకల్పానికి ఈ పెట్టుబడులు నిదర్శనం. ఫలితంగా దేశ వ్యాప్తంగా ప్రజలు విస్తృతంగా లబ్ధి పొందుతారు." అని సత్య నాదెళ్ల ఈ సందర్భంగా చెప్పారు.

ప్రపంచంలో వేళ్లూనుకుంటున్న కృత్రిమ మేధ విప్లవంలో కీలకపాత్ర పోషించేలా భారత్‌ను పటిష్ఠ పరచడానికి తాజా పెట్టుబడులు దోహదం చేయనున్నాయి. భారత్‌లో ఇంత భారీస్థాయిలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెట్టడానికి దోహదం చేసిన అంశాల్లో మోదీప్రభుత్వం విదేశీ పెట్టుబడల విషయంలో అనుసరిస్తున్న స్నేహపూరిత వాతావరణం ఒకటి కాగా, ప్రతిభావంతులైన మానవ వనరుల లభ్యత మరో కారణం. ఏటా 15 లక్షల మంది ఇంజినీరింగ్-టెక్ విద్యా కోర్సులు పూర్తి చేసుకుంటున్నారు. వారిలో ఉద్యోగ నైపుణ్యత ఉన్నవారు దాదాపు 50శాతం మంది అని పరిశ్రమ వర్గాల అధ్యయనాలు చెబుతున్నాయి. ఏటా ఏడున్నర లక్షల మంది ప్రతిభావంతుల లభ్యత కంపెనీలకు మంచి సంఖ్యే. మరోవైపు అమెరికాలో వీసా విధానాల్లో ఎదురవుతున్న అనిశ్చితి కారణంగా అక్కడ బహుళజాతి సంస్థలు తగిన మానవవనరుల కొరత ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడులకు భారత్ అనువైన దేశమని మైక్రోసాఫ్ట్ భావించి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. "కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారు." అని సత్య నాదెళ్ల ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్య గమనార్హం.

2025 నాటికే 20 లక్షల మందిని కృత్రిమ మేధ నిపుణులుగా తీర్చిదిద్దుతామని గతంలోనే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. 2030 నాటికి కోటి మందికి కృత్రిమ మేధ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా సత్య నాదెళ్ల ప్రకటించారు. చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా కృత్రిమ మేధ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి.

కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) వ్యవస్థను భారత్‌లో మరింత విస్తరించే ప్రణాళికలో భాగంగా మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ (ఎంఎస్ఆర్)ల్యాబ్.. కృత్రిమ మేధ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయ నున్నట్లు కూడా ప్రకటించింది. ఈ నెట్‌వర్క్‌లో భాగంగా భారత్‌లో కొత్త భాగ స్వామ్యాలు నెలకొల్పనుంది. ముఖ్యంగా డిజిటల్ ప్రపంచంతో బాగా పరిచయం ఉన్నవారితో భాగస్వామ్యాలు నెలకొల్పనుంది. పరిశోధనలను వాస్తవరూపంలోకి తీసుకువచ్చే ప్రక్రియను, ఆచరణాత్మక వ్యాపార పరిష్కారాలను వేగవంతం చేయడమే ఈ కొత్త భాగస్వామ్యాల లక్ష్యం.

ఉద్యోగార్థులకు, ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారికి కృత్రిమ మేధ నైపుణ్యాలు తప్పనిసరి కాబోతున్నాయి. ఈ నైపుణ్యాలు నేర్చుకోవడంలో ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల నిపుణులతో పోలిస్తే భారతీయ వృత్తి నిపుణులు 50శాతం అదనంగా సమయం కేటాయిస్తున్నారు. కృత్రిమ మేధను మిగిలిన దేశాలవారితో పోలిస్తే మనవారు తొందరగా నేర్చుకుంటున్నారు. కొత్తగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసేవారు కూడా తమ సీవీలను కృత్రిమ మేధ సహాయంతో తయారు చేసుకుంటున్నారంటే ఈ నైపుణ్యాలను అలవాటు చేసుకోవడంలో మన యువత ఎంత ముందున్నారో అర్థం చేసుకోవచ్చు. కొత్త విషయాలను త్వరగా నేర్చుకోవడం, వాటిని పనిలో ఉపయోగించడంలో మన యువతరం వేగంగా ఉండడం మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఒక ప్రధాన కారణం.

గత ఏడాది అక్టోబరులో ఆంధ్రప్రదేశ్ మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనలో సత్య నాదెళ్లను కలిశారు. ఏపీ రాజధాని అమరావతిని కృత్రిమ మేధలో రాజధానిగా తీర్చిదిద్దడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సత్య నాదెళ్లను కలిసి సాంకేతిక రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ పెట్టుబడులను ఆకర్షించడానికి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లే స్వయంగా భారీ పెట్టుబడులపై ప్రకటన చేశారు కాబట్టి ఈ అవకాశాన్ని రెండు ప్రభుత్వాలూ సద్వినియోగం చేసుకోవాలి. దక్షిణ భారత దేశంలోనూ పెట్టుబడులుంటాయన్న సంకేతం మైక్రోసాఫ్ట్ నుంచి వచ్చింది కాబట్టి పెట్టుబడులను రాబట్టుకోవడంలో తదుపరి కార్యాచరణపై తక్షణమే రెండు ప్రభుత్వాలూ దృష్టిపెట్టాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా!

(మొదటిపేజీ తరువాయి)

'పొరపాటునో.. గ్రహపాటునో.. కాలం కలిసొచ్చి కాకిని.. కాపలాదారు పదవి వరిస్తే.. కన్నూమిన్నూ కానక రాజ్యాన్నే కబళించాలని చూసిందట.' సరిగ్గా ఇలాగే ఉంది దేశంలోని కొందరి రాజకీయ నాయకుల పరిస్థితి. సానుభూతితోనో.. శుష్క వాగ్దానాలను నమ్మో.. ప్రజలు అధికారం అందిస్తే.. ఇదే సొకన్నట్లు రాష్ట్రాలకు రాష్ట్రాలనే దోచేందుకు వెనుకాడడం లేదు. ప్రైవేటు, పబ్లిక్ అనే వ్యత్యాసం చూపకుండా, నైతికమా.. అనైతికమా అనే తేడా లేకుండా దోచుకోవడమే పనిగా కొందరు నాయకులు అవినీతిలో సరికొత్త అధ్యాయాలను లిఖిస్తున్నారు. ఈ క్రమంలో కేసులు నమోదైతే.. వాటిని ఏళ్ల తరబడి కొనసాగిస్తూ.. రాజకీయ పబ్బం గడుపు కుంటున్నారు. మరికొందరైతే బెయిల్ మీద బయట తిరుగుతూ యధేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరైతే తమ కేసుల విచారణకు హాజరయ్యే క్రమంలో దర్యాప్తు అధికారులకే చుక్కలు చూపిస్తున్నారు. విచారణకు పిలిచిన రోజు అందుబాటులో ఉండలేమని.. అధికారిక కార్యక్రమాల వల్ల హాజరు కాలేకపోతున్నామని ఏళ్లకేళ్లు కేసులను వాయిదా వేయించుకోవడమే కాకుండా.. చివరికి అవన్నీ తప్పుడు కేసులంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

## దర్యాప్తు సమయంలో విచిత్ర విన్యాసాలు

ఇక దేశంలో సీబీఐ, ఈడీ, రాష్ట్రాల్లో సీఐడీ, ఏసీబీ వంటి సంస్థలు ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడితే కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాయి. అయితే, వీటి విచారణలకు హాజరయ్యే నాయకులు, తమ కళా ప్రదర్శనతో ఏళ్ల తరబడి శిక్షణపొందిన దర్యాప్తు సంస్థల అధికారులనే ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించేస్తున్నారు. అడిగిన దానికి సూటిగా సమాధానం చెప్పకపోగా.. ఆ సమయంలో తాను లేనని.. ఉన్నా ఏం చెప్పానో తెలియదని.. ఏదైనా మాట అని ఉన్నా.. అది ఇప్పుడు గుర్తులేదని.. అసలు ఆ విషయమే తాను మరిచిపోయానని నాటకాలాడుతూ దర్యాప్తును ముందుకు సాగనీయకుండా.. సా...గదీస్తున్నారు. ఇక ప్రాథమిక ఆధారాలు సేకరించి అరెస్టు చేసినా.. తొలుత జైలు.. ఆపై బెయిలు.. తర్వాత షరా మామూలేనంటూ దర్జాగా బతికేస్తున్నారు.

## పదేళ్లకు పైగా బెయిల్‌పై జగన్..

ఇక మొన్నటి వరకు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. దేశంలోనే అత్యధిక కేసులున్న నాయకుడంటే అతిశయోక్తి కాదు. ఏకంగా 11చార్జిషీట్‌లు వేసి మరీ రూ.43 వేల కోట్ల అక్రమ సంపాదనకు సంబంధించిన సంస్థలున్నాయంటూ సీబీఐ ప్రకటించింది. ఈ క్రమంలో పుష్కర కాలం క్రితం ఆయన్ని మూడు రోజుల పాటు వరుసగా విచారణకు పిలిపించింది. ఈక్రమంలో తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని తీసుకున్న లంచాలతో బోగస్ కంపెనీలను ప్రారంభించి ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా తన సంస్థలకు బదలాయించుకున్న విషయంపై అధికారులు ఆయన్ని అనేక కోణాల్లో ప్రశ్నించారు. అయితే, ఆయన కొన్ని ప్రశ్నలకు తనకు తెలియదని.. మరికొన్ని ప్రశ్నలకు గుర్తులేదని.. ఇంకొన్ని ప్రశ్నలకు మరచిపోయానంటూ బదులివ్వడం అప్పట్లో సంచలనంగా మారింది. ఈక్రమంలో సీబీఐ ఆయన్ని అరెస్టుచేసి 16నెలల పాటు జైలులో ఉంచింది. తర్వాత బెయిల్‌పై విడుదలైన జగన్.. రాష్ట్రానికి ప్రతిపక్ష నాయకుడిగా.. ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో దర్యాప్తు సంస్థల అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్‌లనే బదిలీ చేసే స్థాయికి చేరిపోయారు.

## కోర్టులంటే అత్తగారింటికంటే చులకనగా..

తనపై ఉన్న కేసుల విచారణ కోసం ప్రతి శుక్రవారం కోర్టు మెట్లెక్కే పరిస్థితి నుంచి ముఖ్యమంత్రి హోదాలో కోర్టుకు రాలేనని చెప్పే స్థాయికి జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగారు. ఏకంగా పదేళ్లకుపైగా బెయిల్‌పై ఉంటూ అటు కోర్టులకు కానీ.. ఇటు ప్రజలకు గానీ ఏమాత్రం జవాబు దారీగా లేకుండా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ అధికారులను రాష్ట్రంలోకి రాకుండా.. తన పార్టీ నాయకులు, అనుచరులతో అడ్డుకున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా నిందితుడైన ఎంపీ అవినాష్‌రెడ్డిని ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు రాష్ట్రానికి రాగా వారిపైనే రివర్స్ కేసులుపెట్టే స్థాయిలో నిస్సిగ్గుగా వ్యవహరించడం సగటు ప్రజాస్వామ్యవాదులని కలచివేసింది. తన సొంత బాబాయి హత్య కేసు దర్యాప్తును ముఖ్యమంత్రి హోదాలో ఉండికూడా కనీస స్థాయిలో ముందుకు తీసుకెళ్లలేదని.. పైగా అడ్డుకునేందుకు రకరకాల పన్నాగాలు పన్నడంతో చివరికి ఆయన చెల్లెళ్లే కొంగుచాచి న్యాయం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందనే వాదనలూ లేకపోలేదు.

## ఏ1కి మించి ఏ2

ఇక అక్రమాస్తుల కేసులో ఏ1గా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఏ2గా ఉన్న విజయసాయిరెడ్డి చేసిన నక్కజిత్తులు.. వేసిన ఎత్తులు అన్నీఇన్నీ కావు. తన కేసుల నుంచి రక్షణ పొందేందుకు ఆడిటర్ స్థాయి నుంచి రాజకీయాల్లో ప్రవేశించి ఎంపీ స్థాయికి చేరారు. తనపై దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోకుండా సామదాన భేద దండోపాయాలతో ముందుకు సాగుతున్నారు. పైగా అక్రమసంబంధాలు, భూకబ్జాలు, తాజాగా కాకినాడ పోర్టుల్లో ఇతరుల వాటాలను కారుచౌకగా దక్కించుకునేందుకు విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సీఐడీ కేసు నమోదు చేయగా దర్యాప్తునకు హాజరై తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయానంటూ.. అధికారుల ముందు తన నటనా కౌశలాన్ని ప్రదర్శించారనే విమర్శలు భారీగానే వినిపిస్తున్నాయి. ఇదే కేసులో జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.

## తెలంగాణలోనూ ఇలాంటి వారే..

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత ఓ మహిళగా ఉండి ఢిల్లీ మద్యం కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయారు. ఈ కేసులో ఈడీ విచారణకు పిలిచిన సమయంలో ఆమె ఏకంగా 8 సెల్‌ఫోన్లు, పదుల సంఖ్యలో సిమ్‌కార్డులను ధ్వంసం చేసినట్లు వెలుగు చూడడం సంచలనం రేపింది. విచారణ సమయంలోనూ ఓవరాక్షన్ చేశారనే విమర్శలొచ్చాయి. తర్వాత జైలు కెళ్లి బెయిల్‌పై బయటి కొచ్చి నిస్సిగ్గుగా మళ్లీ రాజకీయాలు చేస్తున్నారు. తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ఈ-కార్ రేస్ నిర్వహణ కోసం ఓ ప్రైవేటు కంపెనీకి కేబినెట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఆమోదం లేకుండా.. ఆర్‌బీఐ నిబంధనలకు వ్యతిరేకంగా డబ్బులు చెల్లించడంపై నమోదైన ఏసీబీ, ఈడీ కేసుల విచారణ లోనూ తప్పించుకునేందుకు నానా హంగామా చేస్తున్నారు. నాయకులు తీరు ఇలా ఉంటే.. ఇతర రంగాలవారు కూడా ఇదే పంథాలో సాగిపోతున్నారు. దీనికి నిదర్శనం ఇటీవల పుష్పా-2 వివాదంలో అరెస్టయిన హీరో అల్లు అర్జున్ కూడా తెలంగాణ పోలీసులు విచారణకు పిలిచినప్పుడు కొన్ని విషయాలు తెలియదు.. గుర్తులేదు.. మరిచిపోయానంటూ చెప్పడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇక బ్యాంకులను ముంచేసి విదేశాలకు పారిపోయిన వ్యాపారులు విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీల సంగతి సరేసరి. వారు అసలు దర్యాప్తు సంస్థలు నోటీసులనే పట్టించుకోకుండా ఎంచక్కా విదేశాలకు పరారై.. అక్కడ రాజభోగాలు అనుభవిస్తున్నారు. ఏదేమైనా అవినీతిపరులైన నాయకులు, అధికారులు తమ కేసుల విచారణ సమయంలో దర్యాప్తు సంస్థల అధికారులను బకరాలుగా భావిస్తూ.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం మాత్రం సగటు ప్రజల గుండెను గాయం చేస్తోంది. భవిష్యత్‌లో అయినా ఇలాంటి వారికి అడ్డుకట్ట పడుతుందేమో చూడాలి. అలా జరగకుంటే దర్యాప్తు సంస్థలపైన ప్రజలకి నమ్మకం కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు..!

# శ్రీసిటీకి.. ప్రధాని పొగడ్త

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రం గురించి, రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఉత్పత్తిదారులకి భారీ ప్రయోజనాలు లభిస్తున్నాయి. పారిశ్రామిక మరియు ఉత్పత్తిదారుల రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమస్థానంలో ఉండాలన్నది నా ఆకాంక్ష" అంటూ పారిశ్రామిక రంగానికి ఊతం ఇచ్చే విధంగా మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. శ్రీసిటీలో ఇప్పటికే 180 పరిశ్రమలు తమ కార్యకలాపాల్ని ప్రారంభించగా, మరో 45 పరిశ్రమలు వివిధ దశలలో ప్రారంభోత్సవాలకి ముస్తాబవుతున్నాయి. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉండాలని ప్రధాని చెప్పడం, ఆ సందర్భంలో ఉదాహరణగా శ్రీసిటీని ఉటంకించడం గమనార్హం. శ్రీసిటీలో పరుగులు పెడుతున్న ప్రగతికి ప్రధాని మాటలే నిదర్శనం.

## ప్రధాని మాటలు బాధ్యతని పెంచాయి - శ్రీసిటీ యం.డి రవి సన్నారెడ్డి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగం పట్ల శ్రీసిటీ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని ఆకాంక్షని నెరవేర్చడానికి శ్రీసిటీ యాజమాన్యం శక్తివంచన లేకుండా కృషిచేస్తుందని అన్నారు. ప్రధాని మాటల్లో శ్రీసిటీని గురించి ప్రస్తావించడం తమ బాధ్యతని మరింత పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి రవి సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# గోవిందుని చెంత ఘోరం

ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో ఘోరం చోటుచేసుకుంది. భక్తుల జీవితకాల కోరికగా భావించే తిరుమల శ్రీవారి ఉత్తరద్వార దర్శనం కోసం వచ్చినవారు.. టీటీడీ నిర్లక్ష్యం కారణంగా నరకం అనుభవించారు. టోకెన్ల జారీ వ్యవహారం అస్తవ్యస్తంగా మారడంతో తొక్కిసలాట చోటుచేసుకుని ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

నగర వీధుల్లో బారికేడ్ల మధ్య గంటల తరబడి భక్తులను కూర్చోబెట్టడమే కాకుండా.. వారందరినీ ఒక్కసారిగా విడుదలచేయడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. మరికొందరు ఇతరుల కాళ్ల కింద నలిగిపోయారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధుల హాహాకారాలతో తిరుపతి దద్దరిల్లిపోయింది. వారి రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రంగా మారింది. తమవారు ఏమయ్యారో తెలియక బాధిత కుటుంబసభ్యులు దిక్కులు పిక్కటిల్లేలా ఆర్తనాదాలు చేశారు. ఇక ప్రాణాలు కోల్పోయిన వారి బంధువుల కన్నీటికి సమాధానం చెప్పేవారే కరువయ్యారు.

## నిర్వహణలో టీటీడీ పూర్తిగా విఫలం

రోజుల తరబడి సమీక్షలు, భద్రత పేరుతో బారికేడ్ల ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనల మార్పు అంటూ హడావుడి చేసిన టీటీడీ అధికారులు. పాలకమండలి సభ్యులు క్షేత్ర స్థాయిలో మాత్రం చేతులెత్తేశారు. టోకెన్ల కోసం వచ్చే భక్తులను గంటల తరబడి వేచి ఉండేలా చేసిన అధికారులు.. వారికి కనీస సౌకర్యాలను కల్పించడంలో మాత్రం విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీరు, చిన్నపిల్లలకు పాలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేకపోయారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా అనేక టోకెన్లు జారీచేసే కేంద్రాల్లో భక్తులను ఒక్కసారిగా విడిచిపెట్టడంతోనే ఈ ఘోరదుర్ఘటన జరిగిందని, అప్పటివరకు అన్నపానీయాలు లేకుండా వేచివున్న భక్తులు అస్వస్థతకులోనై తోపులాటలో ప్రాణాలు కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇక తొక్కిసలాట ఘటనకు పోలీసు వైఫల్యమే కారణం అంటూ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించడం కూడా వివాదాస్పద మైంది. ఎలాంటి ప్రాథమిక సమాచారం లేకుండా ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే పోలీసులను బాధ్యులుగా చేయడం ఆయన అపరిపక్వతకు నిదర్శనమంటూ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## బాధితులకు బాబు భరోసా!

తిరుపతి తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తిరుపతికి వెళ్లి బాధితులను పరామర్శించారు. టీటీడీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత తీసుకున్నప్పుడు దానికి కట్టుబడి ఉండాలని, విధుల నిర్వహణను కొందరు తమాషాగా తీసుకుంటున్నారని అలాంటి వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. బాధితులకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై ఆరాతీశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ప్రభుత్వం ప్రకటించింది. అలాగే గాయపడిన వారికి 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. చనిపోయిన ఆరుగురి కుటుంబాల వారికి ఇంటికి ఒకరి చొప్పున ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

## అధికారులపై వేటు!

డిఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిలని సస్పెండ్ చేశారు. అలాగే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జేఈఓ గౌతమి, తిరుమల ముఖ్య భద్రతాధికారి శ్రీధర్‌లపై బదిలీ వేటు వేశారు. ఆధ్యాత్మిక నగరం అయిన తిరుపతిలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. క్షతగాత్రులకు పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు.

# దేగా దొరసానమ్మ కన్నుమూత



మాజీ శాసనమండలి సభ్యులు, ప్రముఖ కాంట్రాక్టర్, రాధ - మాధవ్ - గోపిక సినిమా హాళ్ళ అధిపతి (యజమాని) స్వర్గీయ దేగా రామగోపాలరెడ్డి సతీమణి శ్రీమతి దొరసానమ్మ జనవరి 8 బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 86 సంవత్సరాలు. ఆమె గత కొంతకాలంగా బెంగళూరులో తన పెద్దకుమారుడు దేవకుమార్‌రెడ్డి దగ్గర ఉంటున్నారు. రామగోపాలరెడ్డి - దొరసానమ్మ దంపతులకి ముగ్గురు పిల్లలు. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమార్తె శేషుకుమారి - అల్లుడు డాక్టర్ పెన్నా మోహన్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. పెద్ద కుమారుడు దేగా దేవకుమార్‌రెడ్డి సినీ నిర్మాతగా కూడా ప్రపంచానికి పరిచయస్తులు. ఆయన దీర్ఘకాలం చెన్నైలో ఉండి, ఆ తరువాత కొంతకాలంగా బెంగళూరులో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు దేగా శ్రీనివాసులరెడ్డి వ్యాపారవేత్తగా చెన్నైలో సెటిలయ్యారు. దొరసానమ్మకి ఇద్దరు మనుమళ్ళు, ముగ్గురు మనుమరాళ్ళు ఉన్నారు.

రామగోపాలరెడ్డి కాంట్రాక్టులు, వ్యాపారాలు, రాజకీయాలలో నిత్యం తలమునకలై ఉండేవారు. ఆ తరుణంలో దొరసానమ్మ ఓ వైపు కుటుంబ ఆలనాపాలనా చూసుకుంటూనే, మరోవైపు సినిమాహాళ్ళ నిర్వహణ బాధ్యత కూడా తన భుజస్కంధాలపైన వేసుకున్నారు. ఆమె భర్త రామగోపాలరెడ్డి పాతిక సంవత్సరాల క్రితం కన్నుమూశారు. అప్పటినుండి కూడా ఆమె ఆధ్వర్యంలోనే సినిమాహాళ్ళు నడిచేవి. రామమూర్తినగర్‌లో ఉండిన దేగా వారి నివాసం 'రాధ - మాధవ్' ఒకప్పుడు ఆ దారిలో వెళ్లేవారికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. ఆ ఇంటిని తరువాతి రోజుల్లో ఆదాల ప్రభాకరరెడ్డి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఆదాల నెల్లూరు నివాసమే పూర్వం రాధ - మాధవ్.

దొరసానమ్మ కొంతకాలం క్రితం స్వల్ప అనారోగ్యానికి గురై బుధవారం తుదిశ్వాస విడిచారు. ఇంటి పెద్దదిక్కుని కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న దేగా కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'

## రంగనాథుని సన్నిధిలో..

# 10న వైకుంఠ ద్వారదర్శనం



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన..నెల్లూరు రంగనాయకులపేటలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథుని దేవాలయంలో ఈనెల 10న వైకుంఠ ద్వార దర్శనానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు ఆరోజున వైకుంఠ ద్వారం తెరుస్తారు. స్వామివారిని వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తారు కనుక, అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల ఆర్డీఓ అనూష ఆమేరకు ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కలిగించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి, సభ్యులు వీరేపల్లి పద్మజ, వేలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి

## - జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ -




విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. ఇటీవల స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లాస్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డిఇవో బాలాజీరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులందరూ భావిభారత శాస్త్రవేత్తలుగా రాణించేందుకు ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 38 మండలాల నుంచి 114 ప్రదర్శనలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారని, వీటిలో ఆరు ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని డీఇఓ బాలాజీరావు తెలిపారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, జిల్లా సైన్సు సెంటర్ ఇన్‌చార్జి కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం మధుసూదన్, అధ్యాపకులు సాయినాథ్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైల నుంచి...

# నెల్లూరుకు ఆర్టీసీ సర్వీసులు!

సంక్రాంతి పండుగలొస్తున్నాయి కాబట్టి నెల్లూరుజిల్లా వాళ్లు ఎక్కడున్నా, అధికశాతం మంది సొంతవూళ్ళకు వచ్చి పండుగ సంబరాలు చేసుకోవడం ఆనవాయితీ. పండుగ సెలవులను తల్లితండ్రులు, కుటుంబాలతో సహా ఆనందంగా గడిపేందుకు దూరప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, యువకులు అంతా జిల్లాకు తరలివస్తుంటారు. అలాంటివారికి బస్సుల కొరత లేకుండా ఆర్టీసీ ప్రత్యేకబస్సులు నడిపేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల నుంచి నెల్లూరుజిల్లాకు వచ్చేవారి కోసం జిల్లాలోని పలు డిపోల నుంచి బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం 183 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 121, బెంగుళూరు నుంచి 42, చెన్నై నుంచి 20 బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 9న హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 15 బస్సులు, 10వ తేదీన 35, 11న 32, 12న 35, 13న 4 బస్సుల వంతున నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మురళీ బాబు ఈనెల 4న ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా, బెంగుళూరు నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణీకుల కోసం ఈనెల 9న 6 బస్సులు, 10న 17, 11న 12, 12న 7 బస్సులు నడుపుతామని, చెన్నై నుంచి 9 నుంచి 15వతేదీ దాకా రోజూ 5 ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని, రద్దీకి అనుణంగా అదనపు బస్సులను కూడా సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.



# విద్యతోనే ఉజ్వల భవిత

## - ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందని, అందరూ కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలందుకోవాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల ఆయన నాయుడు దశరథరామిరెడ్డి 26వ వర్ధంతిని పురస్కరించుకుని నాయుడు నాగేశ్వరమ్మ ట్రస్టు ద్వారా తోటపల్లిగూడూరులోని జడ్పీ హైస్కూలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులందించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగంలో జరుగుతున్న అనేక సంస్కరణలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. గత అయిదేళ్ళలో వైకాపా ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేసిన తప్పులన్నీ సరిదిద్ది విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. తోటపల్లి గూడూరులోని సిద్ధవరపు నారాయణరెడ్డి జెడ్పీ హైస్కూలుతో పాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న భవనాల నిర్మాణాలను పూర్తిచేస్తామని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అదనపు గదులు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గిరిజనుల బిడ్డలందరూ తప్పకుండా బడికి వచ్చేలా అందరూ శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రారంభమైందని, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో బాగా రాణించాలని సూచించారు.

# విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు

## ● అందజేసిన సోమిరెడ్డి మనుమడు, మనుమరాలు




నూతన సంవత్సరారంభం సందర్భంగా మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనుమడు రణదేవ్‌రెడ్డి, మనుమరాలు అమైరా ఇటీవల అల్లీపురంలోని పలు నిరుపేద గిరిజన కుటుంబాలవారికి, వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలందజేశారు.

## సన్నపురెడ్డి చొరవతో..

# దేవాలయాలకు ప్రత్యేక బస్సులు

### మొన్న బిట్రగుంట కొండకు..
### నేడు మాలకొండకు ఆర్టీసీ సర్వీసులు



బీజేపీ నేత, ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి చొరవతో జిల్లాలో ఇప్పటిదాకా ప్రధాన ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యం లేని ప్రముఖ దేవాలయాలకు ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుండడంతో భక్తులు, ఆయా ప్రాంతాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొండ బిట్రగుంటలోని ప్రాచీనమైన బిలకూట క్షేత్రం..శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఇటీవలే కావలి నుంచి ఆర్టీసీ బస్సును ఏర్పాటుచేసిన నేపథ్యంలో, తాజాగా కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్దకు రెండు బస్సులు ఏర్పాటుచేశారు. నెల్లూరు 1వడిపో నుంచి ప్రతి శనివారం మాలకొండకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఒక బస్సు ఆర్టీసి ప్రధాన బస్టాండు నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి, 7.15 గంటలకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండుకు వెళ్ళి, అక్కడ నుంచి బుచ్చిరెడ్డి పాళెం, కలిగిరి, కొండాపురం మీదుగా ఉదయం 11.10 గంటలకల్లా మాలకొండకు చేరుకుంటుంది. మరోబస్సు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి స్థానిక ఆత్మకూరుబస్టాండు వద్దకు వచ్చి 10.30కి బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు మాలకొండకు వెళ్తుంది. అదేవిధంగా, తిరుగు ప్రయాణంలో ఒక బస్సు మాలకొండ నుంచి ఉదయం 11.10 గంటలకు, మరో బస్సు మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి నెల్లూరుకు చేరుకుంటాయని ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# టూకీగా...

## వావిళ్ల అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్యపరీక్షలు

విడవలూరు మండలం వావిళ్ళ గ్రామంలోని అంగన్‌వాడీ పిల్లలకు రామతీర్థం వైద్యాధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి ఇటీవల ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఆ చిన్నారుల ఆరోగ్యం గురించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు చెప్పి, వారికి తగు సూచనలిచ్చారు. ఏఎన్‌ఎం పెంచలమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ముసునూరువారిపాళెంలో ఉచిత దంతవైద్య శిబిరం

ముత్తుకూరు మండలం ముసునూరువారిపాళెం గ్రామంలో ఇటీవల స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు మునుకూరు రవికుమార్‌రెడ్డి సహకారంతో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. నారాయణ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో 34 మందికి దంత పరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. పలువురికి దంత చికిత్సలు చేశారు.

## నాగినేనిగుంటలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

మర్రిపాడు మండలంలోని నాగినేనిగుంట అటవీప్రాంతంలో పేకాటాడుతున్న నలుగురిని ఈనెల 6న పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు–ఆత్మకూరు ఎస్‌ఐలు శ్రీనివాసులు, జిలాని కలసి అక్కడున్న పేకాట స్థావరంపై దాడిచేసి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వద్ద నుంచి 12వేల రూపాయలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

## తూర్పుకంభంపాడులో బెల్ట్‌షాప్‌లపై దాడులు

చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడులోని మద్యం బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, రెండు షాపుల నుంచి 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## పొదలకూరు శివాలయానికి లక్షా 28వేల ఆదాయం

పొదలకూరు శివాలయంలో ఈనెల 6న హుండీలెక్కింపు జరిగింది. 9 నెలల వ్యవధిలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 1,28,334 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఎం.సుధీర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## చెర్లోపల్లి రైతులకు రాయితీతో గడ్డి విత్తనాలు

మనుబోలు మండలం చెర్లోపల్లిలో ఇటీవల పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ నాగమణి ఆధ్వర్యంలో పలువురు రైతులకు ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం పశు వైద్య శిబిరం ఏర్పాటుచేసి గేదెలకు, ఆవులకు వైద్య పరీక్షలు చేసి, మందులిచ్చారు. ఏ.డి గురవారెడ్డి, టీడీపీ నాయకుడు పొన్నూరు అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో సావిత్రిబాయి పూలే జయంతి

కందుకూరు బీసీ బాలికల హాస్టల్‌లో ఈనెల 5న భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బహుజన రిసోర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీటీఏ మహిళా జిల్లా కార్యదర్శి ఏ.అరుణకుమారి, ఉపాధ్యాయినులు షర్మిల, సమత, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హుస్సేనీ తదితరులు పాల్గొని సావిత్రిబాయి పూలే చేపట్టిన సామాజిక సంస్కరణలను విద్యార్థినులకు వివరించారు.

## నిడిగుంటపాళెంలో యూరియా పంపిణీ

వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెం రైతులకు చవటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడు రావూరి రాధాకృష్ణమనాయుడి సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. సొసైటీ అధికారి రవి, ఏఓ హరికరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనుబోలు ఎంపీపీ కార్యాలయం తనిఖీ

మనుబోలులోని మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఇఓ విద్యారమ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో ముందుండాలని సిబ్బందికి చెప్పారు. ఎంపీడీఓ జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రాకి మోడీ వరాల వర్షం!

## ➢ 2,08,548 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అండగా తామున్నామంటూ ప్రధాని నరేంద్రమోడీ భరోసా ఇవ్వడంతో పాటు 2,08,548 కోట్ల రూపాయల నిధులను ప్రకటించి రాష్ట్రంపై వరాలజల్లు కురిపించడంతో రాష్ట్ర ప్రజల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఈనెల 8న విశాఖలో పెద్దఎత్తున జరిగిన సభలో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర నేతల సమక్షంలో ప్రధాని చేసిన ప్రసంగం, ఆంధ్ర ప్రజలకిచ్చిన వరాలు రాష్ట్రానికి ప్రగతిదారులు వేయను న్నాయి. మోడీ వరుసగా మూడోసారి ప్రధాని అయ్యాక, తొలిసారిగా విశాఖ పట్నానికి రావడం. 2,08 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం హర్షదాయకం. రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమైన విశాఖపట్నం రైల్వే జోన్‌కు ప్రధాని మోడీ ఈ సందర్భంగా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో విశాఖ ప్రజలు పెద్దఎత్తున కరతాళధ్వనులు చేశారు. ఎంతోకాలం నుంచి ప్రజలు ఈ రైల్వే జోన్‌ను కోరుకుంటున్న నేపథ్యంలో, సాక్షాత్తూ ప్రధాని వచ్చి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. విభజన హామీల్లో ముఖ్యమైన ఈ రైల్వేజోన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు కూడా కేటాయించి, వాటి ఏర్పా టుకు నడుం బిగించడం, అదేవిధంగా విశాఖ రైల్వే జోన్‌తో పాటు విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని ప్రధాని హామీ ఇవ్వడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వాటితో పాటు గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్కులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు చేయడంతో ఇక రాష్ట్రానికి మంచిరోజులు వచ్చినట్లేనని అందరూ భావిస్తున్నారు. అంతేకాదు, రవాణా రంగంలో ప్రధానమైన పలు రైల్వే ప్రాజె క్టులు, రోడ్డు నిర్మాణాలను ప్రారంభిస్తూ వాటిని జాతికి అంకితం చేశారు. మొత్తంగా దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా నిధులతో ప్రధాని మోడీ పలు ప్రాజెక్టులను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులన్నీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వారి శ్రేయస్సుకు, ఎంతగానో తోడ్పడబోతున్నా యంటూ ప్రధాని మోడీ ప్రకటించారు.



# దివ్యాంగులకు విపిఆర్ చేయూత

## ● వింజమూరులో 140 మందికి ట్రై సైకిళ్ళు అందజేత

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతుల పుణ్యమా అంటూ జిల్లాలోని అనేకమంది దివ్యాంగులకు అత్యవసరమైన పరికరాలు అందుతూ, వారి జీవితాలకు వెలుగుబాటలు పరుస్తున్నాయి. ఈనెల 8న ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో 140 మంది దివ్యాంగు లకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు పంపిణీ చేయడంతో, ఆ దివ్యాం గులు తమను ఆదుకున్న విపిఆర్‌కు కృత జ్ఞతలు చెప్పుకున్నారు. విపిఆర్ మాట్లా డుతూ, 10 సంవత్సరాల క్రితం విపిఆర్ ఫౌండేషన్‌ను స్థాపించామని, ఆనాటినుండి పేద ప్రజలకు విద్య, మంచినీటి వసతి తదితర సేవలందిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయగిరి నియో జకవర్గంలో ఎక్కువమంది విభిన్న ప్రతిభా వంతులను గుర్తించామని, అందుకే మొద టగా వారికి ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించా మని, జిల్లాలోని మిగిలిన అన్ని నియోజక వర్గాల్లోనూ త్వరలోనే ట్రైసైకిళ్లు అందిస్తా మని, వాటికి అవసరమైన మరమ్మత్తులు చేసేందుకు సైతం ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లతో కలిసి ఆయన దివ్యాంగులకు ట్రైసైకిళ్ళను పంపిణీ చేశారు.

# జయప్రదంగా.. జాతీయ క్యారమ్స్

నెల్లూరులో తొలిసారిగా జాతీయ క్యారమ్స్ పోటీలు జయప్రదంగా జరిగాయి. మూడురోజుల పాటు స్థానిక నెల్లూరుక్లబ్ వేదిగా జరిగిన ఈ 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్స్ కప్ పోటీల్లో 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 8న జరిగిన ఫైనల్స్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సిహెచ్ జనార్ధన్‌రెడ్డి(విశాఖ), మహిళల సింగిల్స్ విభాగంలో పుదుచ్చేరి నివాసి కె.పూజ చాంపియన్లుగా నిలిచారు. పురుషుల విభాగంలో జనార్ధన్‌రెడ్డి తర్వాత, బీటీ సందీప్, కె.శ్రీనివాస్, ప్రశాంత్‌మోర్‌లు వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. మహిళల సింగిల్స్ విభాగంలో పూజ చాంపియన్‌గా నిలవగా, ఇలవజి, కాజల్‌కుమారి, వి.మిత్ర ఆ తరువాతి స్థానాలను సాధించుకున్నారు. మహిళల డబుల్స్‌లో పీఎస్‌పీబీకి చెందిన ఖజీమా-వి.మిత్రల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా తమిళనాడుకు చెందిన బి.శోభిక-ఎస్ ప్రీతి ప్రిన్స్ జట్టు బహుమతినందుకుంది. పురుషుల డబుల్స్ విభాగంలో ఆర్బీఐకి చెందిన జహీర్‌బాషా-ప్రశాంత్‌మోరే జట్టు ప్రథమస్థానంలో నిలవగా, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్‌దారియా-పంకజ్ అశోక్‌పవార్‌ల్ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ ధ్యక్షుడు జోసెఫ్ మేయర్ (స్విట్జర్లాండ్), ప్రధాన కార్యదర్శి వీడీ నారాయణ, అఖిల భారత క్యారమ్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నారాయణ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, కోశాధికారి విశ్వనాథ్, రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ జలీల్, ఫెడరేషన్‌కప్ కో-చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ శ్రీమన్నారాయణ, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా రామ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు



వైకాపా నాయకుడు, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఈనెల 8న ఘనంగా జరిగాయి. ఎన్‌బికెఆర్ కళాశాల ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ హరినాథ్‌రెడ్డి, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి కేక్ కోసి అందరికీ పంచారు. ఎన్‌బికెఆర్ కళాశాలల అభ్యుదయం కోసం రామ్‌కుమార్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తూ ఉద్యోగుల, విద్యార్థుల జీవితాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తున్నారని వారు ఈ సందర్భంగా కొనియాడుతూ, రామ్‌కుమార్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్..నూతన కార్యవర్గం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 8న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కిలారి శ్రీనివాసులునాయుడు ప్రెసిడెంట్‌గా, గువ్వల నారాయణరెడ్డి సెక్రటరీగా, మాగంటి ప్రసాద్ కోశాధికారిగా, తలపనేని హరిబాబు గౌరవాధ్యక్షునిగా మన్నేపల్లి సురేష్ జాలీవాకర్‌గా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఇన్‌స్టలేషన్ అధికారిగా పలగాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొని కొత్త కార్యవర్గం వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. 203 వాకర్స్ జిల్లా ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌కె నజీర్ అహ్మద్, శానంపూడి సుబ్బరాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, కనకట్ల రఘురాం ముదిరాజ్, కిలారి తిరుపతినాయుడు, వేలూరు రంగారావు, కె.అంకిరెడ్డి, ఎస్ రాఘవేంద్రశెట్టితో పాటు పలు వాకర్స్ క్లబ్‌ల వారు పాల్గొని కొత్త కార్యవర్గాన్ని అభినందించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com